# వార్త

ఆదివారం

28 జనవరి, 2024

# మహాలక్ష్ములకు ఆర్టీసీ కటాక్షం..



తారాతీరం

# రామ్-ఆషిక రంగనాథ్?



'ఇస్మార్ట్ శంకర్ 2' చిత్రం తరువాత రామ్ త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నట్టు వినికిడి. త్రివిక్రమ్ బన్నీతో ఒక సినిమా, వెంకీ-నాని కాంబినేషన్‌లో ఒక సినిమా చేయవలసి ఉంది. ఈ రెండు సినిమాల్లో ఏదో ఒక సెట్స్‌పైకి వెళుతుందని అనుకున్నారు. కానీ 'పుష్ప 2' ఇంకా పూర్తి కాలేదు. వెంకీ, నాని డేట్స్ సరుబాటు కావడం లేదని తెలుస్తోంది. అందువల్ల త్రివిక్రమ్ కూడా రామ్ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించాలనే ఆలోచనతో ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం పూరి దర్శకత్వంలో రామ్ చేస్తున్న సినిమా త్వరలో పూర్తవుతుంది. ఆ తరువాత రామ్ చేసే సినిమా త్రివిక్రమ్‌తోనే ఉంటుందని అంటున్నారు. ఇందులో ఆషిక రంగనాథ్ హీరోయిన్‌గా వుండే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు తాజా సమాచారం.

# శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుశ్!



శేఖర్ కమ్ముల అంటే సున్నితమైన భావోద్వేగాలు కలిగిన ప్రేమకథా చిత్రాలు కళ్లముందు కదలాడతాయి. 'ఆనంద్', 'గోదావరి', 'ఫిదా' మొదలైన సినిమాలను ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. అయితే ఈసారి శేఖర్ కమ్ముల తన మార్క్ కథలను కాకుండా భిన్నమైన కంటెంట్‌ను సిద్ధం చేసుకున్నాడు. ధనుశ్ కథానాయకుడుగా, మాఫియా నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమా తెలుగుతో పాటు తమిళంలోనూ విడుదల కానుంది. సంగీత దర్శకుడుగా దేవిశ్రీ ప్రసాద్‌ను ఎంచుకున్నారు. సునీల్ నారంగ్-పుస్కూర్ రామ్మోహన్ నిర్మిస్తున్న ఈ సినిమాలో రష్మిక కథానాయికగా అలరించనుంది. కెరియర్ పరంగా ధనుశ్‌కు ఇది 51వ సినిమా. ఇందులో కీలకమైన ఓ పాత్రలో నాగార్జున కనిపించనున్నట్లు తెలుస్తోంది.

ఆదివారం వార్త

28 జనవరి, 2024

## మంచి ముత్యాలు

ప్రతి సంవత్సరం ప్రతి వ్యక్తి తనలోని ఒక్క దురలవాటును రూపుమాపుకోగలిగితే ఎంత నికృష్టుడైనా క్రమంగా ఉత్తముడవుతాడు. - బెంజిమిన్ ఫ్రాంక్లిన్

## విషయ విశేషం

ప్రత్యేకం... 4

'సంఘీ'భావం....5

మండుతున్న భూగోళంతో ముప్పు

కవర్ స్టోరీ..6

మహాలక్ష్ములకు
ఆర్టీసీ కటాక్షం..

బహుముఖ ప్రజ్ఞాశాలి 'పోతుకూచి'...10

ఈవారం కవిత్వం..12

భారమేనేమో!

వార్డ్‌రోబ్‌తో సొగసైన ఇల్లు...14

పింక్‌సాల్ట్ మంచిదేనా?....18

కథ.. 20

కాలచక్రం

సాహిత్యం..23

నైజాం పాలనలో మాతృభాషకు సంకెళ్లు

బ్రెజిల్‌లో అద్భుత విగ్రహాలు..25

ఎటువైపు తలపెట్టి నిద్రిస్తే మంచిది?...29

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..

## తాజా వార్తలు

### ఈ స్టోర్లు ప్రత్యేకం

కొన్ని ప్రాంతాలకే పరిమితమైన వస్తువులు, వాటికి ఉన్న డిమాండు, రూపొందించే విధానం..తదితర అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని జీఐ ట్యాగ్ పేరుతో ప్రత్యేక గుర్తింపును ఇవ్వడం తెలిసిందే. అలాంటి వస్తువుల్ని కొనుక్కోవడం కొందరికి సరదా. అయితే వాటిలో ఒక్కో వస్తువు కోసం ఒక్కో ప్రాంతానికి వెళ్లకుండా అన్నీ ఒకే దగ్గర లభించేలా ఏర్పాటైన స్టోరే బెంగళూరులోని 'జీఐ ట్యాగ్డ్'. దీన్ని ఎస్.ఎస్.జయరాం అనే రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ప్రారంభించారు. మూడు అంతస్తుల్లో ఉండే ఈ స్టోర్‌లో జీఐ ట్యాగ్ పొందిన దాదాపు 18 వస్తువులు అందుబాటులో ఉంటాయి. వాటిల్లో బాస్మతీ బియ్యం, చెన్నపట్నం బొమ్మలూ, నగలూ, గద్వాల్ చీరలూ, మసాలా దినుసులూ, కొండపల్లి కళాకృతులూ..ఇలా అన్నీ దొరుకుతాయి. సాధారణంగా జీఐ ట్యాగ్ అందుకున్న వస్తువులు రకరకాల చోట్ల లభించినా వాటిల్లో కొన్ని నకిలీలూ ఉండటం వల్ల వినియోగదారులూ మోసపోయే ఆస్కారం ఎక్కువ. ఇవన్నీ ఆలోచించే జయరాం ఈ స్టోర్‌ని ప్రారంభించారు. ఇక్కడ లభించేవన్నీ ఆయా ప్రాంతాల్లో రైతులు పండించినవీ లేదా కళాకారులు తయారు చేసినవీ అయ్యుంటాయి. వాళ్లందరితో పనిచేసేందుకు జీఐ పంచాయత్ పేరుతో ఓ సంఘాన్నీ ఏర్పాటు చేసింది సంస్థ. ఈ స్టోర్ ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ తరహాలోనూ పనిచేస్తుంది.

### జోక్స్..జోక్స్..

విలేకరి: మేడమ్, మీకు ఉత్తమ నటి అవార్డు వచ్చింది కదా దీనికి కారణం ఎవరు?

నటి: ఈ అవార్డుకు కారణం మా అన్నయ్యే!

విలేకరి: అన్నయ్యనా, అదెలా?

నటి: ఆయనే మరి దీనికి జడ్జి నోరుజారింది నటి.

...

అర్చన: నువ్వు, మీ ఆయన ఎందుకు రోజూ గొడవ పడుతుంటారు?

విజయ: ఏం చెప్పను, రోజూ తాగివస్తాడు.

అర్చన: పోనీలే నువ్వే సర్దుకో..


విజయ: అదెలాగే నేను కొనితెచ్చుకున్న మందు తాగితే ఎలా?

- ఈ.ఎస్.మాధవన్

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com

# ప్రత్యేకం

# కోటీశ్వరుడైన తోటమాలి



నమ్మకమైన ఉద్యోగులకు కొన్ని సంస్థలు, యజమానులు భారీగా బహుమతులు, ఉన్నత పదవులు ఇవ్వడం సహజం. కానీ, ఓ యజమాని మాత్రం నమ్మకమైన తోటమాలికి తన వెయ్యికోట్ల ఆస్తి మొత్తాన్ని రాసిచ్చాడు. ఆశ్చర్యపోతున్నారా? ప్రముఖ ఫ్యాషన్ సంస్థ హామీజ్ యజమాని 81 ఏళ్ల నికోలస్ ప్యూయెష్ (స్విట్జర్లాండ్) పెళ్లి చేసుకోలేదు. ఈ మధ్య ఆయన ఆరోగ్య పరిస్థితి బాగ లేకపోవడంతో తన రూ.1,110 కోట్ల ఆస్తికి తన దగ్గర పనిచేస్తున్న ఒక తోటమాలిని వారసుడిగా ప్రకటించాడు. ప్రకృతిని అమితంగా ఇష్టపడే నికోలస్‌కి ఖాళీ సమయాల్లో తోటలో గడపటం అలవాటు. ఆ క్రమంలో తన తోటను చక్కగా సంరక్షిస్తున్న తోటమాలితో మంచి స్నేహం కుదిరింది. ఆ స్నేహం వల్ల తోటమాలి ఎంత నమ్మకస్తుడో అర్థమైంది. అందుకే తన ఆస్తికి అతనే సరైన వారసుడని నిర్ణయించుకున్నాడు నికోలస్. ప్రస్తుతం తోటమాలిని దత్తత తీసుకొని ఆస్తిని అప్పగించే పనిలో ఉన్నాడు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాతనే అతని పేరు, వివరాలను ప్రకటిస్తానని నికోలస్ ప్యూయెష్ తెలిపాడు. మొత్తానికి నారుకు నీరు పోసి నికోలస్ నమ్మకాన్ని గెలుచుకుని త్వరలోనే కోటీశ్వరుడు కానున్నాడు ఆ తోటమాలి.

ఇది ప్రపంచంలోనే అతిపెద్ద

# హిమనగరం



హిమనగరం. చైనాలోని హార్బిన్ నగరంలో ఏటా శీతకాలంలో జరిగే హిమశిల్పాల వేడుకల కోసం దీనిని తాత్కాలికంగా ఏర్పాటు చేస్తుంటారు. ఈసారి కూడా హార్బిన్‌లో ఈ హిమనగరాన్ని ఏర్పాటు చేశారు. పగటిపూట ధవళకాంతులతోను, రాత్రి వేళ విద్యుద్దీపాలంకరణలతో పరివిల్లు రంగులను వెదజల్లుతూ మిరుమిట్లు గొలిపే ఈ హిమ నగరానికి దేశదేశాల నుంచి హిమశిల్పులు వచ్చి చేరుకుంటారు. వారంతా ఇక్కడ ఆకాశ హర్మ్యాలను తలపించే హిమభవంతులను, చిత్రవిచిత్రమైన హిమశిల్పాలను రూపొందించి, తమ కళానైపుణ్యాన్ని ప్రదర్శిస్తారు. దాదాపు 400 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసే ఈ హిమనగరానికి ఏటా దాదాపు 1.80కోట్ల మంది వరకు పర్యాటకులు వస్తుంటారు. హార్బిన్‌లోని సన్‌ఐలండ్, బస్ అండ్ స్నోవరల్డ్ ప్రాంతాల పరిధిలో ఏర్పాటయ్యే ఈ వేడుకలు చైనా ప్రభుత్వానికి దండిగా పర్యాటక ఆదాయాన్ని సంపాదించి పెడతుంటాయి. ఈనెల 5వ తేదీన ప్రారంభమైన ఈ వేడుకలు ఫిబ్రవరి 5వరకు జరగనున్నాయి.



# 'సంఘీ' భావం



# మండుతున్న భూగోళంతో ముప్పు

మారుతున్న ఆధునిక పోకడలు, శాస్త్రీయ సాంకేతిక రంగం మానవ మనుగడకు ముప్పుగా మారుతోంది. భావితరాల భవిష్యత్తును నిర్లక్ష్యం చేస్తూ ఒకపక్క రికార్డు స్థాయిలో కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు, మరోపక్క సహజ వాతావరణ పరిణామమైన ఎల్‌నినోలు భూగోళంపై ఉష్ణోగ్రతలు ఇంతగా పెరగడానికి దోహదం చేస్తున్నాయని అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. భూగోళంపై పెరుగుతున్న తాపానికి సంబంధించి శాస్త్రీయ నివేదిక స్పష్టం చేసిన అంశాలు పరిశీలిస్తే మనకు ఏ మేరకు ముప్పు పొంచి ఉందో అర్థం అవుతుంది. గత 150 ఏళ్లలో ఎన్నడూ లేనంత అధిక ఉష్ణోగ్రత 2023వ సంవత్సరంలో నమోదు అయినట్లు నివేదిక స్పష్టం చేస్తోంది. వాస్తవానికి 2016లో అధిక ఉష్ణోగ్రత నమోదైంది. అయితే ప్రస్తుతం దానిని మించి 2023 రికార్డు సృష్టించింది. సుమారు 150 సంవత్సరాల్లో ఎన్నడూ నమోదు కాని అధిక ఉష్ణోగ్రతను గత సంవత్సరంలో చవిచూడాల్సి వచ్చింది. మరో అంశం ఏమిటంటే భూవిజ్ఞాన సాక్ష్యాధారాలు, ఉపగ్రహ సమాచారాలను విశ్లేసించి చూస్తే దాదాపు లక్ష సంవత్సరాల్లో అధిక వేడిమి కలిగిన సంవత్సరంగా కూడా 2023 నిలుస్తోంది. ఇది కేవలం మానవులు చేస్తున్న నిర్లక్ష్య ధోరణి వల్ల కలుగుతున్న విపత్తుగా మాత్రమే అర్థం చేసుకోవాలి. గ్లోబల్ వార్మింగ్ విషయంలో పదేపదే హెచ్చరికలు చేస్తున్నా ఏ దేశం కూడా దీనిని పట్టించుకోవడం లేదు. పారిశ్రామికీకరణకు ముందు నాటితో పోలిస్తే రెండు డిగ్రీల సెల్సియస్‌కు మించి ప్రపంచ ఉష్ణోగ్రత పెరగకుండా చూడాల్సిన అవసరం ఉందని శాస్త్రజ్ఞులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఎనిమిదేళ్ల క్రితం జరిగిన ప్యారిస్ సదస్సులో ప్రపంచదేశాలు భూతాపాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామని వాగ్దానం చేశాయి. అయితే ఎక్కడా వాటిని అనుసరిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. గతంలో అత్యధిక ఉష్ణాగ్రతలు రికార్డు అయితే ఏడాది 2016, సగటున 0.17 డిగ్రీలు హెచ్చు ఉష్ణోగ్రత ఉంటే 2023 ఆ రికార్డును తిరగరాసి 1.5కు చేరింది. ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే సంవత్సరాలు మరింత దుర్భరంగా మారే ప్రమాదం ఉంది. భూతాపంతో ఇరాన్, చైనా, గ్రీస్, స్పెయిన్, టెక్సాస్, అమెరికా దక్షిణ ప్రాంతాలు వేసవి తాపాన్ని అత్యధికంగా నమోదు చేశాయి. కెనడాలో అనూహ్యారీతిలో కార్చిచ్చు చెలరేగింది. సముద్ర ఉష్ణోగ్రతలు కూడా గతంలో ఎన్నడూ లేనంతగా ఉడికిపోయాయి. శీతాకాలంలో కూడా అంటార్కిటా సముద్ర తీరాల వెంట హిమ ఘనీభవనం చాలా తక్కువ స్థాయిలో నమోదు అయ్యింది. విష వాయువులను వెదజల్లే పరిశ్రమలను లెక్కకు మించి ఏర్పాటుచేయడం, హరిత వనాలను నరికివేసి నివాస ప్రాంతాలుగా మార్చుకోవడం వంటి అంశాలపై ప్రభుత్వాలు లోతైన పరిశీలన చేయాలి. రహదారుల నిర్మాణం, పరిశ్రమల ఏర్పాటు పేరుతో పెద్ద సంఖ్యలో చెట్లను నరికివేస్తున్నారు. రోడ్ల పక్కన చెట్లను నాటడం, వాటిని పరిరక్షించడం వంటి వాటిని అమలుచేయడం లేదు. వాహనాల నుంచి వెలువడే కాలుష్యం వల్ల తీవ్రనష్టం కలుగుతోంది. ప్లాస్టిక్ వ్యర్థాలను ఇష్టారాజ్యంగా పారేస్తున్నా రు. వీటిని అదుపు చేయడం మన దేశంతో పాటు అగ్రరాజ్యాలు కూడా విఫలం చెందుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా నాలుగువేలకు పైగా పక్షిజాతులు అంతరించిపోయాయని జంతుప్రేమికులు పేర్కొంటున్నారు. ఎండవేడిమికి తట్టుకోలేక సూక్ష్మ జంతుజాలాలు చనిపోతున్నాయి. దీనితో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది. భూతాపాన్ని నివారించడానికి ఇకనైనా చిత్తశుద్ధితో ఐక్య కార్యాచరణను ఏర్పాటుచేసుకోవాలి. అత్యవసరంగా ఆర్థిక వ్యవస్థను కర్బన రహిత దిశగా నడిపించాలి. పర్యావరణ సమాచారాన్ని, పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఇప్పటికే అనేక జల చరాలు మనుగడను కోల్పోయాయి, డబ్ల్యుఎంవో, సీసీసీఎస్‌లే కాదు వందలాది శాస్త్రీయ అధ్యయనాలు ప్రమాదాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి, ఏటా పెరుగుతున్న తాపాన్ని జనాలు కూడా ప్రత్యక్షంగా అనుభవిస్తున్నారు. డిగ్రీలో పదోవంతు మేర భూతాపం పెరిగినా వడగాడ్పులు, తుపానులు తీవ్రతరం అవుతాయి, సముద్ర మట్టాలు గణనీయంగా పెరుగుతాయి. హిమానీనదాలు త్వరగా కరిగిపోవడం ప్రారంభిస్తాయి. భరించరాని వేడిమి వెదజల్లుతాయి. ఇంత జరుగుతున్నా ప్రపంచ దేశాలు మీనమేషాలు లెక్కిస్తూ పరిస్థితిని మౌనంగా పరిశీలిస్తున్నాయి. అగ్రరాజ్యాలు సహా అన్నీ సమిష్టిగా భూతాపాన్ని తగ్గించేం దుకు ముందుకు రావాలి. వీలైనంత త్వరగా నెట్ జీరో స్థాయికి చేరి, జీవనయోగ్యమైన వాతావరణాన్ని పరిరక్షించుకోవాలి. 2023 సంవత్సరంలో చవిచూసిన వేడిమి పరిస్థితులు మళ్లీ రానివిధంగా అన్ని దేశాలు సమిష్టిగా పోరాటం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పారిస్‌లో జరిగిన ఒప్పందాన్ని తప్పనిసరిగా అమలుచేయడానికి చర్యలు తీసుకోవాలి. ఇలాంటి సమావేశాలు తరచు నిర్వహించడం ద్వారా ఏయే దేశాలు ఏమేరకు చర్యలు తీసుకున్నాయో చర్చించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దేశాన్ని కాపాడుకోవడానికి రక్షణశాఖకు ఇస్తున్నటువంటి ప్రాధాన్యతనే పర్యావరణ పరిరక్షణకు కూడా కల్పించే విధంగా ప్రణాళికలు రూపకల్పన చేస్తే ఆశించిన ఫలితాన్ని పొందే అవకాశం ఉంటుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థను ఏర్పాటుచేసిన విధంగా ప్రపంచ స్థాయిలో పర్యావరణ పరిరక్షణకూ ఒక ప్రపంచ స్థాయిలో సంస్థను ఏర్పాటుచేసి పర్యవేక్షించే విధంగా చర్యలు తీసుకుంటే చక్కని ఫలితాలు పొందే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ




# మహాలక్ష్ములకు ఆర్టీసీ కటాక్షం..

కవర్ స్టోరీ

డి.జె.మోహన రావు

**ప్రజారవాణా అనేది ఆధునిక పట్టణ జీవనంలో కీలకమైన అంశం. ప్రజారవాణా ఉచితం అనే ఆలోచనకు మద్దతుగా ప్రపంచవ్యాప్తంగా అధికసంఖ్యలో ప్రతిపాదకులు ఉన్నారు. ఇది ఖచ్చితంగా ఆకర్షణీయమైన ఆలోచన.**

ఏ ప్రాంతంలో రవాణా సౌకర్యం అందుబాటులో ఉంటుందో ఆ ప్రాంతం మిగిలిన ప్రాంతాలకంటే వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఉచిత ప్రజారవాణా భావన అనేది ఒక విప్లవాత్మక ఆలోచన. దీనినే జీరో-ఫేర్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ లేదా ఫ్రీఫేర్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ (ఎఫ్ఎఫ్‌పిటి) అని పిలుస్తారు. ఇది అనేక సామాజిక సమస్యలకు గల పరిష్కారాలలో ఒకటిగా నిలుస్తుంది. ఫేర్-ఫ్రీ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ అనేది అమాయక భావన కాదు. దీని అమలుకు సంబంధించి అనేక ట్రైల్స్, ప్రయోగాలు నిర్వహించబడ్డాయి.

ప్రపంచంలో ఉచిత ప్రజారవాణా దేశాలు, ప్రాంతాలు

ప్రపంచంలోనే ఉచిత ప్రజారవాణాను ప్రవేశపెట్టిన మొదటి దేశంగా లక్సెంబర్గ్ నిలిచింది. ఇక్కడ 29 ఫిబ్రవరి 2020 నుండి అమలవుతుంది. బస్సులు, ట్రామ్‌లు, రైళ్లలో అందరికీ ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. దీని సరసన మాల్టాదేశం 1 అక్టోబర్ 2022న రెండవ దేశంలో చేరింది. 4,20,000 కంటే ఎక్కువమంది జనాభా కలిగిన ఎస్టోనియా రాజధాని నగరం టాలిన్, అలాగే అనేక మధ్యతరహా యూరోపియన్ నగరాలు, ప్రపంచంలోని అనేక చిన్న పట్టణాలు తమ ప్రజారవాణా నెట్‌వర్క్‌లను జీరోఫేర్‌గా మార్చాయి. వాషింగ్టన్‌లో 14 గ్రామీణ రవాణా వ్యవస్థలు 2020లలో జీరో-ఫేర్ విధానాలను అనుసరించాయి. సెప్టెంబరు 2022 నుండి ఇక్కడ చాలా స్థానిక, అంతర్-నగర రవాణా వ్యవస్థలలో 18, అంతకంటే తక్కువ వయస్సు ఉన్న ప్రయాణీకులకు ఛార్జీలు ఉచితం. కొన్ని నిబంధనలతో 60ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారికి స్కాట్లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్, గ్రేటర్ లండన్, ఇంగ్లండ్ దేశాల్లో యునైటెడ్ కింగ్డమ్ దేశ వ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణసౌకర్యం కల్పించింది. ఇంకా కెనడా దేశంలో మాంటియల్, సౌత్‌షోర్‌లోని చాంబ్లీ శివారు, ఇతర మునిసిపాలిటీలు 2012 నుండి అక్కడ నివాసితులకు ఉచిత ప్రజారవాణాను అందిస్తున్నారు. స్వీడన్‌లోని అవెస్టా పట్టణం, ఇంగ్లాండ్‌లోని డ్యూస్‌బరీ, ఆస్ట్రేలియాలోని పెర్త్‌నగరంలోని కొన్ని ప్రాంతాలలో, యుఎస్ఎలోని సౌత్ కరోలినాలో, క్లెమ్సన్, ఫిన్లాండ్‌లోని మేరీహమ్న్ పట్టణంలో ఉచిత ప్రజారవాణాను కల్పిస్తున్నాయి.

## మనదేశంలో..

ఇక మనదేశంలో చూస్తే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాల కోసం పథకాన్ని 3 జూన్ 2019న ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రారంభించారు. దీనికింద ప్రభుత్వం ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అమలు చేసింది. 2021న తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కూడా గత యేడాది బేసిక్ ఫేర్ ప్రభుత్వ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని ప్రకటించారు. కర్ణాటక రాష్ట్రంలో (నాన్ ఎ.సి.ప్రభుత్వ బస్సుల్లో) విద్యార్థులు, మహిళలతో పాటు ట్రాన్స్జెండర్‌లకు ఛార్జీల ఉచిత బస్సు ప్రయాణాన్ని అందించే శక్తి అని పిలువబడే పథకం జూన్ 11, 2023న ప్రారంభించబడింది. పంజాబ్ రాష్ట్రంలో కూడా కొన్ని నిబంధనలతో ఇటువంటి కార్యక్రమం అమలవుతుంది. డిసెంబరు 9, 2023 నుండి తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేస్తుంది. ఇతర రాష్ట్రాలు ఉచిత రవాణా లేని మహిళలకు మద్దతును అమలు చేశాయి. మహారాష్ట్రంలోని ముంబయిలో మహిళలు బస్సుల్లో సగం ధరకే చెల్లిస్తున్నారు. భారతదేశంలో అత్యధిక జనాభా

కలిగిన రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ గత సంవత్సరం రక్షాబంధన్ పండుగ ఒక రోజు ఉచిత రవాణా పథకాన్ని అమలు చేసింది. ఇతర రాష్ట్రాలు ఉచిత రవాణా లేని మహిళలకు మద్దతును అమలు చేశాయి. భారతదేశంలో మొట్టమొదటి ఉచిత బస్సు పథకాన్ని అమలు చేసింది. భారతదేశంలో మొట్టమొదటి ఉచిత బస్సు పథకాన్ని 2019లో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం ఢిల్లీలో ప్రారంభించింది. 2021-22లో సుమారు 3 కోట్లమంది మహిళలు ఈ ఉచిత బస్సు సేవను పొందారు. ఈ పథకం తర్వాత ఢిల్లీ బస్సులు మహిళల ప్రయాణీకుల సంఖ్య 10శాతం (నవంబర్ 2021) పెరిగాయి. చెన్నైలో ఈ పథకం అమలులో మహిళల ప్రయాణీకుల సంఖ్య 40శాతం నుండి 61శాతంకి (జులై 2021 నుండి) పెరిగిందని డేటా సూచిస్తుంది.



మహిళలకు మాత్రమే బస్సులలో ఉచిత ప్రయాణం ఎందుకు?
భారతదేశంలో వ్యవసాయ కార్యకలాపాలు క్షీణిస్తున్నందున మహిళలకు ఉద్యోగ అవకాశాల కొరత కొనసాగుతోంది. స్త్రీ, పురుషులు వేర్వేరు ప్రయాణ విధానాలు అవసరాలను కలిగి ఉంటారు. శ్రామికశక్తిలో మహిళల భాగస్వామ్యం పెరగడానికి రవాణా సదుపాయాల లభ్యత కీలకపాత్ర పోషిస్తుంది. భారతదేశం ప్రపంచంలోనే అతితక్కువ మహిళా కార్మికుల భాగస్వామ్యం కలిగి ఉంది. ప్రపంచబ్యాంకు నివేదికల ప్రకారం 2022 నాటికి మనదేశంలో 15 ఏళ్లకంటే ఎక్కువ వయస్సు ఉన్న మహిళలలో ఉపాధి ఉన్నవారు 25శాతం కంటే తక్కువ ఉన్నారు. ఇది 2012లో 27శాతంగా ఉండేది. బ్లూమ్‌బెర్గ్ ఎకనామిక్స్ 2021 విశ్లేషణ ప్రకారం ఆర్థిక వ్యవస్థలో మహిళల భాగస్వామ్యానికి అతిపెద్ద అడ్డంకులు ఉన్నదేశాల్లో భారతదేశం ఒకటి. ప్రస్తుతానికి, భారతదేశ స్థూల దేశీయోత్పత్తిలో మహిళలు 17శాతం వాటా కలిగి ఉన్నారు. ఉపాధి అంతరాన్ని పూడ్చడం ద్వారా 2050 నాటికి భారతదేశం తన స్థూల దేశీయోత్పత్తిని 60శాతం వరకు పెంచుకోవచ్చని నివేదించింది. దీనికి శ్రామిక మహిళా భాగస్వామ్యం చాలా అవసరం. భారతదేశంలో శ్రామికశక్తిలో మహిళల భాగస్వామ్యం తక్కువగా ఉంది. బంగ్లాదేశ్ 32శాతం, శ్రీలంకలో 34.5శాతంతో పోలిస్తే భారతదేశ శ్రామికశక్తిలో 23శాతం మహిళలు ప్రాతినిధ్యం వహిస్తున్నారని తాజాప్రపంచ బ్యాంకు గణాంకాలు చెబుతున్నాయి. పురుషులతో పోలిస్తే మహిళలు తక్కువ ఆదాయ అవకాశాలు అందుబాటులో ఉంటున్నాయి. గ్లోబల్ శ్రామికశక్తి భాగస్వామ్యరేటు పురుషులకు 80శాతంతో పోలిస్తే మహిళలు 50శాతంతోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి. అణగారిన వర్గాల స్త్రీల విషయంలో ఆర్థిక స్వాతంత్ర్యం అవసరం. ఎందుకంటే వారు తక్కువ విద్యతో పురుషులపై ఎక్కువ ఆధారపడుతున్నారు. వారు కూడా ఎక్కువగా నిరుద్యోగులు. మెజారిటీ భారతీయ కుటుంబాలలో, పురుషులు గృహ వాహనానికి ప్రాముఖ్యత కలిగి ఉంటారు. అయితే మహిళలు సాధారణంగా ప్రజారవాణాపై ఆధారపడతారు.

## ఉచిత రవాణా ఎంతమేర ఉపయోగం?

నిరుపేద ప్రజలలో సాధారణమైన కుటుంబంలో ఆర్థిక సంక్షోభం ఉంటే మహిళలే మొదట ప్రభావితం అవుతారు. అసంఘటిత రంగంలో పనిచేసే వారిలో మహిళలే ఎక్కువగా దేశంలో ఉన్నారు. వారికి వేతనాలు తక్కువగా ఉంటాయి. ఛార్జీరహిత ప్రయాణం వీరికి కొండంత అండగా ఉంటుంది. ప్రజారవాణా ఉచితంగా చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు టిక్కెట్ల నుండి వచ్చే ఆదాయాన్ని కోల్పోయే ఖర్చుకంటే చాలా ఎక్కువ అని నిపుణులు తెలుపుతున్నారు. ఉచిత ప్రజారవాణా ఆర్థికంగా బలహీన వర్గాల మహిళలకు సహాయం చేస్తుంది. ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ డెవలప్‌మెంట్ పాలసీ చేసిన అధ్యయనం ప్రకారం పురుషుల కంటే మహిళలు ప్రజారవాణాపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. భారతదేశంలో స్త్రీల డబ్బును పురుషులు నియంత్రించడం ఇప్పటికీ సాధారణం. అదే పురుషులు తమ కుటుంబంలోని మహిళలు ఇంటి వెలుపల పని చేయడాన్ని వ్యతిరేకించవచ్చు లేదా మహిళలు పని చేయడానికి అనుమతించినప్పటికీ వారి ప్రయాణం నమ్మదగనిది లేదా భరించలేనిది కాదా అని వారు తరచుగా నిర్ణయించుకుంటారు. ఎటువంటి ఖర్చు లేని రవాణా వారికి ఇంతకు ముందు లేని ఎంపికను అందిస్తుంది. ఉపాధిలో లింగ వ్యత్యాసం ఎక్కువగా ఉన్నప్పటికీ, పట్టణ మహిళల 84శాతం ప్రయాణాలు పబ్లిక్, ఇంటర్మీడియట్ పబ్లిక్, నాన్-మోటరైజ్డ్ ట్రాన్స్‌పోర్ట్ ద్వారానే జరుగుతున్నాయి. భారతదేశంలో స్త్రీలు బయటకు వచ్చి పనిచేయడానికి అనేక కారణాల వల్ల పరిమితం చేయబడింది. పురుషులు, మహిళలు ప్రజారవాణాను వేర్వేరుగా ఉపయోగిస్తున్నారని అధ్యయనాలు తెలుపుతున్నాయి. అందువలన ఛార్జీలు లేని బస్సు ప్రయాణం మహిళలకు ఆర్థిక, భావోద్వే సామాజిక, ఆరోగ్య ప్రయోజనాలకు దారితీస్తుంది. పితృస్వామ్య సమాజంలో ఛార్జిలు లేని బస్సు ప్రయాణం మహిళా సాధికారతకు దారితీస్తుందని స్పష్టమైంది. ఉపాధి, విద్య లేదా ప్రాథమిక సేవల అందుబాటు వారి నివాస స్థలానికి దూరంగా వున్నప్పుడు పురుషుల కంటే మహిళలు ఎక్కువగా ప్రభావితమవు తున్నారు. మహిళలకు మెరుగైన వేతనం వారి నివాస ప్రాంతానికి దూర ప్రాంతాల్లో లభిస్తున్నప్పటికీ వ్యక్తిగత



వాహనాలు లేని మహిళలు తక్కువ సామాజిక–ఆర్థిక నేపథ్యాలకు చెందిన మహిళలు రవాణా చార్జీలు భారం అవడం వల్ల ఎక్కువగా వారి నివాసానికి దగ్గరగా ఉన్న ప్రదేశాలలో తక్కువ వేతనానికే ఉద్యోగాలు చేయవలసి వస్తుంది. ఉచిత రవాణాతో ఎక్కువ మంది మహిళలు మెరుగైన వేతనం లభించే ఉద్యోగాల కోసం పొదుపును ఆస్వాదిస్తూ పట్టణాలకు వెళ్లడానికి అవకాశం లభిస్తుంది. మనం అవునన్నా కాదన్నా ఆర్థిక స్వాతంత్ర్యం లేని మహిళలు తమ కన్నవారింటికి, దేవాలయాలకు, తమ బంధువుల ఇంటికి, పెళ్లిళ్లకు, పేరంటాలకు వెళ్లాలన్నా ప్రయాణ ఖర్చులకు తమ ఇంటిలోని మగవారి సంపాదన మీదనే ఆధారపడుతున్నారు. బస్సులలో ఉచిత ప్రయాణం ఇలాంటి సమస్యలకు పరిష్కారం ఇస్తుంది. మహిళలకు ప్రజా రవాణాను మరింత అందుబాటులోకి తీసుకురావడం ద్వారా సామాజిక సమానత్వానికి దోహదపడుతుంది. తక్కువ ఆదాయం ఉన్నవారిపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గుతున్న మూలంగా ఇది సామాజిక అసమానతలు తగ్గిస్తుంది. ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే బాలికలకు ఉచిత ప్రయాణం ఒక వరం లాంటిది. నగరాలలోని కళాశాలల సొంత బస్సుల ఛార్జీల మోత భరించలేక కేవలం దగ్గరలో ఉన్న కారణాన బోధనలో నాణ్యతా ప్రమాణాలు లేకపోయినా కొన్ని కళాశాలల్లో బాలికలు తమ విద్యను కొనసాగిస్తున్నారు. ఉచిత ప్రయాణం వలన వారిప్పుడు దూరం అయినా కూడా మంచి ప్రమాణాలు ఉన్న కళాశాలల్లో చదువుకునే అవకాశం లభించనుంది. పట్టణాలలో చాలామంది మహిళలు అనేక మాల్స్, మార్టులలో పనిచేస్తున్నారు. వారికి వచ్చే వేతనం అరకొర మాత్రమే. అందులో కొంత భాగం రవాణా చార్జీలకే ఖర్చవుతుంది. ఉచిత రవాణా వలన కొంత భాగం మిగులుతుంది. దీనిని ఇతర అవసరాలకు ఖర్చు పెట్టడమో లేదా పొదుపు చేస్తున్నారు. కుటుంబంపై ఆర్థిక భారాన్ని కూడా తగ్గిస్తుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో ఉన్న మహిళలు ప్రసవం లేదా ఇతర ఆరోగ్య సమస్యలకు తనిఖీలకు నగరాలలో ఉన్న ఆసుపత్రులకు చాలాసార్లు వెళ్లవలసి ఉంటుంది. కానీ ఛార్జీలు భారం మోయలేక తక్కువ సార్లు వెళుతున్నారు. ఇంకా ఇక్కడ మనం గమనించవలసిన విషయం మరొకటుంది.





మగవారికి తోడుగా వారి ఇంట్లో ఉన్న మహిళలు ఇప్పుడు వెళ్లొచ్చు. ఛార్జీల రహిత బస్సు ప్రయాణం మహిళలకు షాపింగ్ కోసం ప్రజా రవాణాను ఉపయోగించుకునే అధికారం కల్పిస్తుంది. వారి మానసిక ఉల్లాసానికి మంచి విశ్రాంతి. ఉచిత రవాణా వలన మహిళలు షాపింగ్ చేయడానికిగానీ, సినిమాలకు గానీ దగ్గరలో ఉన్న నగరాలకు వెళ్లే అవకాశం మూలాన రాష్ట్ర జడిపి పెరుగుతుంది. ఛార్జీల రహిత బస్సు ప్రయాణం, మహిళలు తమ గమ్యస్థానాలకు నడవడానికి ఖర్చు చేసే సమయాన్ని ఆదా చేయడానికి, ఇతర ప్రయోజనాల కోసం ప్రజా రవాణాను ఉపయోగించుకునేలా చేస్తుంది. ఛార్జీల రహిత బస్సు ప్రయాణం మహిళలకు నగరంలో స్వేచ్ఛగా తిరిగే స్వేచ్ఛను ఇస్తుంది. వారి ప్రయాణావసరాల కోసం ఇతర కుటుంబ సభ్యులపై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది. ప్రయాణ ఖర్చుల గురించి చింతించకుండా చదువుకోవడం, పని చేయడం మహిళలకు పెద్ద ప్రయోజనం. ఉపాధి కోసం లేదా ఇంటి పనుల కోసం ఇంటి నుండి బయటకు వెళ్లే మహిళలు పురుషుల కంటే చాలా ఎక్కువగా నడవవలసి వస్తుంది. భద్రతా కారణాల దృష్ట్యా మహిళలు తక్కువ రద్దీ రోడ్లపై కాకుండా సాధ్యమైన ఎక్కువ జన సమూహం, వాహనాలు రద్దీగా ఉండే మార్గాల్లో నడవడానికి ఇష్టపడతారు. దీని వల్ల కాలుష్యానికి గురవుతున్నారు. ఇప్పుడలా కాదు.. ఛార్జీలు లేని బస్సు ప్రయాణం వల్ల మహిళలు ఎగ్జాస్ట్ పొగలను పీల్చుకోకుండా మెరుగైన ఆరోగ్యానికి దారి తీస్తుంది. ఢిల్లీలో ఛార్జీలు లేని బస్సు ప్రయాణం ప్రవేశపెట్టిన తర్వాత– ప్రైవేట్ బస్సుల్లో ప్రయాణించడం కంటే ప్రభుత్వ బస్సుల్లో ప్రయాణించడం సురక్షితంగా మారిందని, మహిళా ప్రయాణికుల సంఖ్య పెరగడంతో సాధారణ వేధింపుల సంఘటనలు తగ్గాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ఎక్కువ మంది మహిళలతో ఉన్నప్పుడు సుఖంగా భద్రత ఉంటుంది. ఇది మహిళలకు ఎక్కువ భద్రతకు దారి తీస్తుంది.

## కాలుష్యం తగ్గుతుంది...

ఉచిత ప్రజా రవాణా రోడ్డుపై వ్యక్తిగత వాహనాల సంఖ్యను తగ్గిస్తుంది. వ్యక్తిగత వాహనాలతో పోల్చితే బస్సు ప్రయాణం పర్యావరణానికి అనుకూలంగా మారుతుంది. గ్లోబల్ వార్మింగ్ సమస్య తగ్గుతుంది. తక్కువ ఇంధనంతో ఎక్కువ ప్రయాణికులు వారి గమ్యాన్ని చేరుకోవచ్చు. కార్బన్ ఉద్గారాలను తగ్గించడంలో సహాయపడతాయి. సుమారుగా 50 వ్యక్తిగత వాహనాలలో వెళ్లే వారు బస్సులో వెళ్లగలరు. రోడ్లపై ట్రాఫిక్ కూడా తగ్గుతుంది.



### తెలంగాణా రాష్ట్రంలో ఉచిత ప్రయాణంలో మహిళలకు ఎదురవుతున్న సమస్యలు-పరిష్కాలు

అధిక ఆదాయం కలిగిన మహిళలు టికెట్ తీసుకొని ప్రయాణం చేయాలి. తెలంగాణలో 2023 నాటికి 1497 ఆర్టీసీ బస్సులు గ్రామీణ ప్రాంతాలలో తిరుగుతున్నాయి. 62-65 శాతం గ్రామీణ ప్రాంత ప్రజలున్నారు. వీరికి తగ్గట్టుగా కొన్ని రూట్లలో బస్ సర్వీసులు తక్కువగానే ఉంటున్నాయి. ఇలాంటి మార్గాలలో ఎక్కువ బస్సులు వేయాలి. అన్ని గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆ ప్రాంతాలవారు కోరుతున్నారు. సామర్థ్యం మించి బస్సులలో ప్రయాణించడం వల్ల కొంత మంది ఆకతాయి పురుషులు కావాలనే మహిళలను తాకుతున్నారు. మహిళలకు మాత్రమే కొన్ని బస్సులు ప్రవేశపెడితే ఇలాంటి సంఘటనలు జరగవు. పరిష్కారాలు వాళ్లని తలదన్నే విధంగా ఉండాలి. బస్సు సర్వీసుల సమయపాలన, ఫ్రీక్వెన్సీ మెరుగుపరచబడాలి. మహిళలు పబ్లిక్స్ ట్రాన్స్‌పోర్ట్‌ను ఉపయోగించకుండా సిగ్గుపడటానికి మరొక కారణం అధిక రద్దీ. రద్దీ తరచుగా లైంగిక వేధింపులకు సహాయపడే పరిస్థితిని సృష్టిస్తుంది. దీనికి పరిష్కారంగా అప్పుడప్పుడు బస్సులలో మఫ్టీలో మహిళా పోలీసులు ప్రయాణించాలి. దీని కోసం ఒక ప్రత్యేకమైన స్క్వాడ్‌ని ఏర్పాటు చేయాలి. చివరి స్టాప్ వచ్చేంత వరకూ మహిళల భద్రతకు భరోసా కలిగించాలి. బస్ డ్రైవర్లు, కండక్టర్లు, సెక్యూరిటీ గార్డులు, టికెట్ కలెక్టర్ల మొదలైన ఫ్రంట్‌లైన్ పాత్రల్లో ఎక్కువ మంది మహిళలను నియమించడం ద్వారా మహిళల భద్రతను మెరుగుపరచవచ్చు. ప్రయాణించే మహిళలు వాళ్ల ఫీడ్ బ్యాక్, వారు ఎదుర్కొన్న సమస్యలు పరిష్కరించడానికి ఒక టోల్ ఫ్రీ నంబరును ఏర్పాటు చేయాలి. పరిశోధనాత్మకంగా, ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని సమీక్షించి, అవసరమైన దగ్గర మార్పులు చేర్పులు చేపట్టాలి.

## సానుకూలతలు-పరిష్కారాలు

తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహాలక్ష్మి పథకంపై ప్రజలు భిన్న అభిప్రాయాలు వెల్లడిస్తున్నారు. పేద, మధ్య తరగతికి చెందిన మహిళలు, విద్యార్థినులు ఉపయోగమని చెబుతున్నారు. రోజువారీ బస్సులలో విధులు నిర్వహించేవారు మాత్రం ఉచితం ప్రయాణం వలన ఇబ్బందులు పడుతున్నామంటున్నారు. అవసరం లేనివారు కూడా ప్రయాణాలు కొనసాగిస్తున్నారని దీని వలన బస్సులలో విపరీతమైన రద్దీ ఉంటుందని వాపోతున్నారు. బస్సుల సంఖ్య పెంచవలసిన అవసరం ఉంది. లేదా మహిళలకు మాత్రమే ప్రత్యేక బస్సులు వేయాలని మహిళలు కోరుతున్నారు. విపరీతమైన రద్దీ వల్ల బస్సుల్లో దొంగతనాలు పెరిగే అవకాశం లేకపోలేదు. తద్వారా వారి సెల్‌ఫోన్లు, ఇతర విలువైన ఆభరణాలు, డబ్బుల విషయంలో మరింత జాగ్రత్తలు పాటించాలి. విపరీతమైన రద్దీ వల్ల ఉద్యోగినుల వెతలు అన్నీఇన్నీ కావు. రోజూ ప్రయాణం వారికి ఒక నరకంగా మారిందని వాపోతున్నారు. తెలంగాణలోని నాలుగున్నర లక్షల ఆటోల్లో హైదరాబాద్, సికిందరాబాద్ జంట నగరాల్లో రెండు లక్షల ఆటోలు తిరుగుతుండగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆరు లక్షల మంది ఆటో రిక్షాలపై ఆధారపడి జీవిస్తున్నారని అంచనా. ఆటో డ్రైవర్లు కూడా ఈ ఉచితం వలన తమ వాహనాలలో మహిళలెవరూ ప్రయాణించడం లేదని, ఇంకా వారితో పాటు ప్రయాణం కొనసాగిస్తున్న పురుషులు కూడా వారికి తోడుగా ఆ బస్సులలోనే ప్రయాణిస్తున్నారని, దీని మూలంగా రోజువారి ఆదాయాన్ని కోల్పోతున్నామనీ; బ్యాంక్‌లోన్ తీసుకున్నవారు ఫైనాన్స్ కూడా కట్టలేకపోతున్నామనీ; అంతేకాక తమ పొట్టపోషణ కూడా కష్టమవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి ఉపశమనంగా నెలవారీ ప్రభుత్వం కొంత మొత్తంలో ఆర్థిక సహాయం చేయాలని కోరుతున్నారు.

## టి.యస్.ఆర్.టి.సి. పరిస్థితి

టి.యస్.ఆర్.టి.సి. అంచనాల ప్రకారం ప్రతిరోజూ దాదాపు 40 లక్షల మంది ప్రయాణికులు బస్సుల్లో తిరుగుతున్నారు. వీరిలో కనీసం 30 శాతం మంది మహిళలు ఉన్నారు. సంస్థకు రోజుకు సుమారు రూ.14 కోట్లు రాబడి వస్తుందని 'మహాలక్ష్మి' పథకాన్ని ప్రవేశపెట్టిన తర్వాత, ఆదాయం కనీసం 50 శాతం తగ్గుతుందని అంచనా వేయబడింది. దీనిని రాష్ట్ర ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుంది.



# బహుముఖ ప్రజ్ఞాశాలి 'పోతుకూచి'



**ఆయన తెలుగు సాహిత్య రంగంలో శిఖర సమానులు. కవిగా, రచయిగా, పత్రికా సంపాదకనిగా, కథకునిగా, నవలాకారునిగా, సంస్థల నిర్వాహకునిగా, యాత్రా-జీవిత చరిత్రల రచయితగా, నాటక రంగ ప్రయోక్తగా, నాటక కర్తగా, కాంగ్రెస్ కార్యకర్తగా, ప్రప్రథమ ప్రపంచ తెలుగు మహాసభల సంధాన కర్తగా, అడ్వకేట్‌గా, స్వాతంత్ర్య సమరయోధునిగా, గ్రంథాలయోద్యమకారునిగా, బహుముఖీయ ప్రజ్ఞాశాలి డా॥ పోతుకూచి సాంబశివరావు.**

తొంభై సంవత్సరాల వయస్సులో ఆగస్టు 6వ తేది 2017లో కాలం చేసారు. ఎక్కడో గోదారి జిల్లా ఆలమూరులో 27 జనవరి 1925లో జన్మించి తన రచనలపై పిహెచ్‌డిలు చేసే స్థాయికి ఎదిగి, ఆంధ్రా యూనివర్సిటి నుండి కళాప్రపూర్ణ బిరుదు, గౌరవ డాక్టరేట్‌ను 1993లో పొందిన గొప్ప వ్యక్తి. చుక్కలు ప్రక్రియ నిర్మాత పల్లవాధవరావు రాసిన 'ఆత్మార్పణ' నాటకం మద్రాసు వాణీ మహల్‌లో ప్రదర్శించి గాంధీజీ ప్రశంసలు పొందిన డా॥ పోతుకూచి 'పల్లె కదిలింది' నాటకం రాసారు. సాహిత్య అకాడమీ అవార్డు పొందింది.

సంజీవయ్య, పి.వి.నరసింహారావు లాంటి నాటి ముఖ్యమంత్రులతో సన్నిహితంగా మెదిలిన పోతుకూచి ఉదయకిరణాలు, అన్వేషణ నవలల ద్వారా ప్రసిద్ధులయ్యారు.

నవ్య సాహితిసమితి, విజయ కళాసమితి, విశ్వసాహితి సంస్థల వ్యవస్థపాకులుగా నిలిచారు. అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్(భోపాల్) సంస్థకు దక్షిణ భారత కోర్డినేటర్‌గా ఇండియన్ రైటర్స్ యూనియన్ నుంచి తామ్రపత్రం సరస్వతీ సమ్మాన్, సి.నా.రె. కళాపీఠం అవార్డు లాంటి శతాధిక పురస్కారాలొందిన పోతుకూచి నేటి తరం కవులకు, కళాకారులకు, కళా సంస్థల నిర్వాహకులకు నిత్య స్ఫూర్తి ప్రదాత.

కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా సంఘం సభ్యుడిగా రెండు దశాబ్దాలు పనిచేసారు. ఆకాశవాణి, దూరదర్శన్, నేషనల్ బుక్ ట్రస్ట్ లాంటి సంస్థలకు 'సలహా సంఘం' సభ్యులుగా పని చేసారు. ఉస్మానియా సెనేట్ మెంబర్‌గా, ప్రాంతీయ సెన్సార్ బోర్డు సభ్యులుగా ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సభ్యులుగా చాలా కాలం పని చేసారు పోతుకూచి.

అఖిల భారత స్థాయిలో ఉపాధ్యక్షులుగా పని చేసారు. విశ్వ-యునిలిట్ ఆంగ్ల పత్రికల విశ్వరచన విశ్వసాహితి పత్రికలు నిర్వహించారు. ఎందరో యువకుల్ని కవులుగా, రచయితలుగా చేసారు. 'ఆత్మకథా తరంగాలు' అనే ఆయన ఆత్మకథ సంజీవయ్య జీవిత చరిత్ర బహు ప్రసిద్ధ గ్రంథాలు.

సాహితీ చైతన్య, సాహితీ భీష్మ, భారత్ భాషా భూషణ్, సరస్వతి సమ్మాన్, కళాప్రపూర్ణ(ఎ.వి.) లాంటి ఎన్నో విశిష్ట బిరుదు పురస్కారాలొందారు. 20కి పైగా యువ రచయితల సభలు ఆయన నిర్వహించారు. ఐదు వేలకు పైగా సాహితీ సభలు నిర్వహించారు.

**– తంగిరాల చక్రవర్తి**

## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్య కరమైన హాస్యాన్ని అందించే కార్టూ న్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్ల తిప్పి పంప గోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపిం చాలి.

కార్టూన్లు పంపించాల్సిన చిరునామా:
ఎడిటర్, ఆదివారం వార్త, నం.396,
లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన,
హైదరాబాద్-500 080.
sunmagvaartha@gmail.com

# లోతైన పరిశోధనల కోసం

**శాస్త్ర** పరిశోధనలను లోతుగా సాగించడం సర్వసాధారణం. అలాగని వాటి కోసం ప్రయోగశాలలను లోతైన ప్రదేశాలలో భూగర్భంలో నిర్మించడం మాత్రమే విడ్డూరమే. ఈ విడ్డూరం చైనాలోనిది. ప్రపంచంలోనే అత్యంత లోతైన లాబొరేటరీని చైనా నిర్మిస్తోంది. భూమికి ఏకంగా 2,400 మీటర్ల లోతైన చోట నిర్మిస్తున్న ఈ లాబొరేటరీ ప్రపంచంలోనే అత్యంత లోతైన భూగర్భ ప్రయోగశాలగా ఇప్పటికే గుర్తింపు పొందింది. 'డీప్ అండర్‌గ్రౌండ్ అండ్ అల్ట్రా లో రేడియేషన్ బ్యాక్‌గ్రౌండ్ ఫెసిలిటీ' పేరుతో సింఘువా యూనివర్సిటీ, యలాంగ్ రివర్ హైడ్రోపవర్ డెవలప్‌మెంట్ కంపెనీలు కలిసి 2020 డిసెంబరు నుంచి ఈ లాబొరేటరీ నిర్మాణాన్ని కొనసాగిస్తున్నాయి.



పిచువాన్ ప్రావిన్స్‌లోని జిన్‌పింగ్ పర్వతం దిగువన నిర్మానుష్య ప్రదేశంలో నిర్మిస్తున్న ఈ లాబొరేటరీ గురించిన వార్తలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. ఏకంగా 120 ఒలింపిక్ స్విమింగ్ పూల్స్‌తో సమానమైన లోతులో నిర్మిస్తున్న ఈ లాబొరేటరీ విస్తీర్ణం ఇటలీలోని గ్రాన్‌సాసో నేషనల్ లాబొరేటరీ కంటే ఎక్కువే. ఇప్పటివరకు ప్రపంచంలోనే అతిపెద్ద అండర్‌గ్రౌండ్ లాబొరేటరీగా గుర్తింపు పొందిన గ్రాన్ సాసో లాబొరేటరీ చైనా దెబ్బకు రెండో స్థానానికి చేరుకుంది. ఇంతకీ ఈ లోతైన భూగర్భ ప్రయోగశాలలో దేని గురించి అంత లోతైన పరిశోధనలు సాగిస్తారనుకుంటున్నారా? ఇక్కడ కృష్ణ పదార్థం (డార్క్‌మేటర్) గురించి పరిశోధిస్తారట! అందువల్ల ఏమాత్రం సూర్యకిరణాలు సోకని రీతిలో, రేడియేషన్ ప్రభావం తాకని రీతిలో దీనిని నిర్మిస్తున్నారట!

# సరికొత్త కారు

కాలంతో పాటు కారూ మారుతున్నది. కారులో సౌకర్యాలూ మారుతున్నాయి. ఒకప్పుడు పాటలకే పరిమితమైన కార్‌స్టీరియో సిస్టం ఇప్పుడు స్మార్ట్‌ఫోన్‌కు దీటుగా తయారైంది. వుడ్‌మ్యాన్ సంస్థ..అత్యాధునిక సౌకర్యాలతో 'ఎక్స్ 9' మాడల్ కార్ స్టీరియోను పరిచయం చేసింది. క్యూఎల్ఈడి డిస్‌ప్లేను ఇందులో అమర్చింది. అయితే, కార్‌మాడల్‌ను బట్టి స్క్రీన్‌సైజ్‌ను ఎంపిక చేసుకోవచ్చు. కార్టెక్స్ ఆక్టాకోర్ ప్రాసెసర్, 2 జీబీర్యామ్ వల్ల ఎలాంటి ఇబ్బంది లేకుండానే



నేవిగేషన్ మ్యాప్స్ లోడ్ అవుతాయి. ఆండ్రాయిడ్ 10 వర్షన్‌పై పనిచేసే ఈ సీరియోను గూగుల్ వాయిస్‌తోనూ



నియంత్రించవచ్చు. 32 జీబీ స్టోరేజీ, 4జీ సిమ్ స్లాట్, వైఫై, టచ్‌స్క్రీన్, 60 వాట్స్ హైబాస్‌సౌండ్..ఇందులో అదనపు సౌకర్యాలు..కెమెరా వ్యూయర్, మ్యూజిక్ సిస్టమ్, నేవిగేటర్‌గానే కాకుండా, స్మార్ట్‌ఫోన్‌గానూ ఉపయోగపడే 'వుడ్‌మ్యాన్ ఎక్స్ 9' ధర మాడల్‌ను బట్టి రూ. 20వేల వరకూ ఉంటుంది.

# ఐఫోన్ మ్యాజిక్

చేతిలో ఐఫోన్ ఉన్నదంటే.. ప్రొఫెషనల్ కెమెరా కూడా ఉన్నట్టే! అధునాతన ఐఫోన్ 15 మాడళ్లలోని 48 ఎంపీ కెమెరాతో 4కే రిజల్యూషన్‌తో వీడియోలు తీయొచ్చు. అయితే, ఆండ్రాయిడ్ ఫోన్లతో పోలిస్తే ఆపిల్ ఫోన్లలో ఫీచర్లు, ఆప్షన్లు తక్కువే! థర్డ్‌పార్టీ యాప్స్ కూడా పరిమితమే. ఈ లోటును పూడ్చటానికి బ్లాక్ మ్యాజిక్ డిజైన్ సంస్థ ఓ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. 'బ్లాక్‌మ్యాజిక్ కెమెరా' పేరుతో వచ్చిన ఈ యాప్‌లో ప్రొఫెషనల్ కెమెరాలకు తీసిపోని ఎన్నో ఆప్షన్లు ఉన్నాయి. 'వన్‌టచ్'తోనే అన్ని రకాల సెట్టింగ్స్..ఫ్రేమ్స్ ఫర్ సెకన్, ఐఎస్ఓ, షటర్ యాంగిల్స్‌ను మనకు నచ్చినట్లుగా మార్చుకోవచ్చు. ఈ యాప్ ద్వారా 4కే వీడియోలను నేరుగా బ్లాక్ మ్యాజిక్ క్లౌడ్‌లో రికార్డు చేయవచ్చు. ప్రపంచంలోని ఏ కంప్యూటర్‌లోనైనా ఆ వీడియోను





ఎడిట్ చేసుకోవచ్చు. ఐఫోన్ కెమెరాకు అదనపు హంగులు అద్దే ఈ 'బ్లాక్ మ్యాజిక్ కెమెరా 'యాప్.. ఉచితం. ఇంకెందుకు ఆలస్యం వెంటనే కొనేయండి..




# భారమేనేమో!

**చిన్ననాటి** యేటిగట్టు ముచ్చట్లు
మిఠాయి పొట్లంలా చుట్టేసి,
నాకోసం పాత జ్ఞాపకాలను మోసుకొచ్చింది.
స్నేహ సుగంధాలు నింపుకున్న లేఖ.
ఆనాటి అల్లరి కేరింతలు,
చిలిపి సరసాలు,
మాస్టర్ అరచేతిలో బెత్తంతో వేసిన దెబ్బలు,
ప్రోగ్రెస్ రిపోర్ట్ చూసి
నాన్న వేయించిన గోడకుర్చీ
కిసుక్కున నవ్విన
సున్నా మార్కుల వనజాక్షి
అందరి ఊసులు మోసుకొచ్చింది.
నా బాల్య మిత్రుడు రాసిన లేఖ
అమ్మ కన్నీటిని,
నాన్న కన్నుల మాటున నిస్పృహలు
మోయలేనంది.

– రాము కోలా

---

# హైకూలు

నవ్వులు
రువ్వేను
పువ్వులు

పరుగు
ఆరోగ్యం
పెరుగు

మనిషి
కావాలి
మనీషి

కోపం
హెచ్చితే
శాపం

కాపాడు
దేవుడు
ప్రార్థించు

చలికి
దుప్పటి
వణికె

కన్నెల
కన్నుల
వెన్నెల

బంధాలు
పంచుకో
పెంచుకో.

జయము
ఓర్పుతో
నేర్పుతో

అప్పులు
తెస్తాయి
తిప్పలు

– శాంతమూర్తి

---

# అనన్యం

అప్పుడు–
మనం నడిచిన ఆ మొదటి దారి
అంత తేలిగ్గా మర్చిపోయేది కాదు.
ఎన్ని పూలు పలకరించేవి
ఎన్ని సీతాకోక చిలకలు భుజాలపై వాలేవి
తన కన్నా చురుకైనా చూడముచ్చటైనా
ఈ జంట ముఖాల్ని కంటిలో వేసుకోటానికే
సూర్యుడు ఉదయించేవాడు
పోతూ పోతూ తెల్ల మేఘం
నల్ల మబ్బై
అలా నాలుగు చినుకుల్ని చిలకరించి నవ్విపోయేది
చెట్లు–నీడ గొడుగుల్ని చేత బట్టుకొని
ప్రియంగా పిలుస్తుండేవి/ ఆకాశంలో చందమామ
అక్షర నక్షత్రాల్తో కవిత్వం రాసేది
నేల–పచ్చని ఒడిలో కూర్చోబెట్టుకొని
ప్రేమ కబుర్లు చెప్పేది/ గుంపులు గుంపులై
ఎగిరే పిట్టలు/ అల్లరి ఆకతాయిలై కేకలేసేవి
అప్పుడప్పుడు/ ఇరువురి ఇసుక పాదాల్తో
అలల పిల్లల్ని పడుకోమని
సముద్రం–తన తీరం మీదకి తరుముతుండేది
ఎక్కడో ఏ లోకంలోనో / చప్పుడు చేస్తున్న ఉరుములా
ఒకరి హృదయ ధ్వని ఒకరికి
మంద్రంగా సాంద్రంగా వినిపిస్తుండేది./ అప్పుడు
మనం నడిచిన ఆ మొదటి దారి/ మృదు మధుర జ్ఞాపకమై
ఇప్పటికీ/ తేనె పువ్వుపై వాలిన తుమ్మెదలా
గుండెల్లో సంగీతిస్తుంది
మనం అద్వైతం/ మనం అనన్యం
మనం/ సప్త వర్ణ సమ్మిళితమైన
అణు తరంగ/ శ్వేత కాంతి స్వరూపం.

– రవి నన్నపనేని



# పుస్తక సమీక్ష



## అన్నీ మంచి కథలే

మాతృభాష మరాఠీ అయినా, తెలుగు సాహిత్యంలో ఘనాపాఠి ఈ 'ఆదివారం కథలు' రచయిత సి.ఎస్.చంద్రశేఖర్. ఇంతవరకు వీరు 9 కథాసంపుటాలు 2 నవలలు 1 కవితా సంపుటిని అందించారు. ప్రస్తుత 'ఆదివారం కథలు' వీరి 10వ కథా సంపుటి. ఈనాడు ఆదివారం అనుబంధంలో 2007 నుంచి 2014 వరకు ప్రచురించబడిన 11 కథలున్నాయి. చంద్రశేఖర్ కథాసంపుటాలు పలు పురస్కారాలు పొందటమే కాదు, ఇతర భాషల్లోకి అనువదించబడి, ఆ,యా,భాషల పాఠకుల మన్ననలు పొందాయి. తల్లిదండ్రుల పెంపకం, ఉద్యోగ నిర్వహణలోని అనుభవం, తనలో చిత్తశుద్ధి, క్రమశిక్షణను పెంపొందించామని గర్వంగా చప్పుకుంటారు రచయిత. వీరు సృష్టించిన పాత్రలన్నింటా ఆత్మవిశ్వాసం, మంచితనం తొణికిసలాడుతుంటాయి. తన చుట్టూ ఉన్నవారికి అది బస్సు కావొచ్చు ఇరుగుపొరుగు కావొచ్చు సాయపడే మంచిగుణమున్న 'చందూ' కథలోని చందూ, 'శుభసంకల్పం'లోని సాధన, తాను ఆసుపత్రిలో ఉన్నా, బెడ్ నుంచి లేచి ఇతరులకు సాయపడే 'బాలు' కథలోని బాలు వీరందరూ, మంచితనాన్ని పంచేవారే! మళ్లీమళ్లీ చదవాలనిపించే మంచి వాక్యాలు, శైలి, ఒక్కోచోట (చందు, కథ, బాలు కథ) నిశ్చేష్టుల్ని చేసే కొసమెరుపు, కథాకథనం ఆకట్టుకుంటాయి. చదివి దాచుకోవలసిన, చదివించదగిన మంచి కథలివి. **(ఆదివారం కథలు, రచన: సి.ఎస్.చంద్రశేఖర్, వెల: రూ 180, ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తకశాలలు)**

**– కూర చిదంబరం**



## 'ఊరిమర్లు కథలు'

ఈ కథల సంపుటిని రచయిత అమ్మనాన్నలైన అనసూయమ్మ, హనుమంతయ్యశర్మలకు అంకితం చేసారు. ప్రఖ్యాత కన్నడ సాహితీవేత్త కుం.వీ., జి.వెంకటకృష్ణ, ఇనాయతుల్లా, కెంగారమోహన్‌లు విలువైన ముందుమాటలు రాసారు. ఈ సంపుటిలో దాదాపు 11 కథలున్నాయి. అవి- ఈశ్వరమ్మ నిన్ను నమ్మితే, వితరణ, మలుపు, కెంపు, నిర్ణయం, తృతీయ, ప్రకృతి, పునరపి, కాల్వ, కుశలంబేగదా ఆంజనేయ, ఊరిమర్లు, నీళ్లింకని నేల కథలున్నాయి. కర్నూలు, ఎమ్మిగనూరు ప్రాంతాల నేపథ్యంగా సాగాయి. భూస్వాముల దురాగతాలను కథీకరించి పాఠకులకు అర్థం అయ్యేలా రాయడం గొప్పవిషయం. కథాసంకలనం ప్రతికథలో కథకునకు తన స్వంత ఊరిలో ఉన్న అనుబంధం వ్యక్తమవుతోంది. రాముడి పాత్రధారి రసూల్‌సాబ్ ఎంపిక నాటకాలు నేర్పించే పాండురంగయ్య కుటుంబ సమస్యలు, గ్రామీణుల కళాభిరుచి, మతసామరస్య జీవనంపై వచ్చిన మంచి కథ 'కుశలం బేగదా ఆంజనేయ' (శ్రీరామాంజనేయ యుద్ధం) నాటకంలోని పద్యచరణం) మదార్బీ అనే హిజ్రా మృతి చెందడం హిందూ, ముస్లిం స్మశానవాటికల్లో ఖననం చేయడానికి ఒప్పుకోని పరిస్థితుల్లో బస్టాండ్ వద్ద ఆందోళన చేసే హిజ్రాలు, అంశంపై (థర్డ్‌జండర్‌ల జీవితంపై) మానవీయకోణంలో రాసిన కథ 'తృతీయ ప్రకృతి'. అన్ని కథలూ పాఠకుల్ని ఆలోచింపచేస్తాయి. **(ఊరిమర్లు, రచన: మారుతి పౌరోహితం, వెల: రూ 130, ప్రతులకు: ఇ.నం.78/8, ఎ,12-2-46, మయూరి రెసిడెన్సీ, విఠల్‌నగర్, కర్నూలు)**

**– కె.ప్రసన్న**

డా॥కత్తి పద్మారావు ఈ దేశం మాది దళిత బహుజన మహాకావ్యంగా సమకాలీన సమాజాన్ని, సామాజిక స్వరూపాన్ని నిలదీసే, సిద్ధాంత చైతన్యాన్ని అందించే మహత్తర గ్రంథం డా॥బి.ఆర్.అంబేద్కర్ దళితుల జీవిత భవితవ్యాల దిక్సూచిగా చూపుడువేలు దర్శింపచేసే గమనం, గమ్యంవైపు తన జీవితకాలంలో సాధించేలక్ష్యం దిశలో ఒక తెలుగు మహాకవి, రచయితగా దివిటీలు



## డా॥కత్తిపద్మారావు 'ఈదేశం మాది'

వెలిగించడం దేశం మాది అని నినదించడం, దళిత రాజ్యాధికారాన్ని లభిలషిస్తూ, అక్షరద్యుతులు సృష్టించడం అంబేద్కరిజం, మానవ మహనీయ వైతాళిక దార్శనికతను చిరఃస్మరణీయం చేస్తోంది. లోకాయత ప్రచురణల ద్వారా డా॥పద్మారావు, 85వ గ్రంథం దళిత కవిత్వంగా గొంతెత్తడం, ఒక మహాకవి శతాబ్దమే తనది అంటే ఈ మహాకవి ఈదేశం మాది అని, దళిత రాజ్యాన్ని ఆకాంక్షించడం తెలుగు కవితా ప్రస్థానంలో చిరంతన భావమేధా ఉజ్వలతకు సంకేతం. 'ఈదేశం మాది ఈ యుగం మాది'తో ప్రారంభమై 'అమ్మ ఒక తాత్విక విశ్వ విద్యాలయం' వరకు 464 పేజీల ఉద్గ్రంథంలో 55 కవితలు వివిధ సందర్భాలలో రాసినవి ఈ కావ్యసంపుటిలో ఉన్నాయి. దళితవాదం ఊపిరిగా, కవితాచిత్రాలుగా కదలాడడం, డా॥ పద్మారావు సృజనాత్మక, కవితా భావోద్వేగ ఆశయప్రతీకగా ఈమహాకావ్యం దర్శింప చేస్తోంది. **(ఈదేశం మాది, రచన: డా॥కత్తిపద్మారావు, వెల: రూ 500, ప్రతులకు: కత్తి స్వర్ణకుమారి, లోకాయత ప్రచురణలు, లుంబినీవనం, అంబేద్కర్‌కాలనీ, పొన్నూరు, గుంటూరుజిల్లా)**

**– యర్రమిల్లి**

జంట కవులు చింతారాంబాబు, మట్టపర్తి నాగరమేష్ సంయుక్తంగా 120 లఘు కవితల్లో వెలువరించిన చిరుగ్రంథం 'నానీల బంధం'. రాంబాబు యిదివరలో 'విరమించని వాక్యం' పేరిట ఓ కవితా సంపుటిని వెలువరించిన అనుభవ



## జంట కవుల 'నానీల బంధం'

జ్ఞుడు. నానీల ప్రక్రియలో వీరు చేసిన తొలి ప్రయత్నం యిది. 'అమ్మ కంట/ ఆగని కన్నీరు/ పెంచినందుకు కాదు/ పంచుకున్నందుకు' ఆర్ద్రత చిప్పిల్లిన ఈ వాక్యాలకు వ్యాఖ్యానం అక్కర్లేదు. 'బిడ్డ/ బువ్వతిన్నది/ అదేంటో/ అమ్మ కడుపు నిండిపోయింది' తల్లి మనస్సును కదు హృద్యంగా ఆవిష్కరించిన నానీలు చాలానే వున్నాయి. 'కొడుకు/ సిగరెట్టు కాలుస్తుండట/ చుట్టలు కాల్చే/ ఓ తండ్రి ఆవేదన' ఎవరు మానెయ్యాలి? తండ్రా..కొడుకా? 'కాస్త గడ్డి వేసారని/ అంతలా పొంగిపోకు/ నీ పాలన్నీ/ పిండుకొనేందుకే' సంక్షేమ పథకాల పేరిట ఆవగింజంత విసిరేసి, అధిక ధరలు, పన్నుల రూపంలో కొండంత గుంజేసే పాలకులు గుర్తుకు రావడం లేదూ? 'జ్ఞానమంటే/ వెలుగు/ అదిలేని జీవితం/ నిశిరాత్రి పులుగు' 'పులుగు' అంటే పక్షి, విహగము. అజ్ఞానుడు చిమ్మచీకట్లోనే దిక్కూ మొక్కూ లేక అలమటించే పక్షి వంటివాడని కవి అభిప్రాయం. మిగతాది మీరు చదవండి, ఆస్వాదించండి. **(నానీల బంధం, రచన: చింతా రాంబాబు, మట్టపర్తి నాగరమేష్, వెల: రూ116, ప్రతులకు: తపస్విమనోహరమ్ పబ్లికేషన్స్)**

**– రమణ వెలమకన్ని**

# వార్డ్‌రోబ్‌తో సొగసైన ఇల్లు

**బట్టలు సర్దుకోవడానికి బీరువాలు, చెక్క బీరువాలు, అల్మారాలు రానురాను కనుమరుగు అయిపోతున్నాయి. పట్టణానికి జీవనోపాధి కోసం జనాభా వలసవెళ్లడం, పట్టణీకరణ పెరగడంతో చిన్నచిన్న అపార్ట్ మెంట్‌లు కట్టి అద్దెలకు ఇచ్చేస్తున్నారు. అపార్ట్ మెంట్ గదులు చిన్నవిగా ఉండడం వల్ల అల్మారాలు పెట్టు కోవటానికి స్థలంసరిపోదు.**

అందుకే వార్డ్‌రోబ్‌లో ఇతర వస్తువులను కూడా చేర్చేస్తుంటారు. అయితే వార్డ్‌రోబ్‌లలో బట్టలే



కాకుండా ఇతర వస్తువులను పెట్టేస్తున్నారు. అలాంటి అనవసరమైనవన్నీ తీసి బయట మరేదైన ప్రదేశంలో పెట్టుకోవాలి. అలా చేయకపోతే అన్ని అందులో మనకు కావలసిన వాటిని ఎక్కడ ఉంచుకోవాలో తెలియక అవసరమై నప్పుడు వాటిని తీయ్యడానికి ఇబ్బంది కలుగుతుంది. అందుకే వార్డ్‌రోబ్ సర్దేపనిలో ఇది మొదటగా చేయాలి. నాలుగ్గోడల మధ్యనున్న శూన్యాన్ని నింపి ఇంటికి హృదయాన్ని అమర్చేదే ఇంటీరియల్ డిజైనింగ్. ఈ డిజైనింగ్‌లో వస్తున్న మార్పులకు అనుగుణంగా అమర్చుకునే అన్ని వస్తువుల రూపాల్లోనూ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. పూర్తయిన ఇంటి నిర్మాణాన్ని చూస్తే ఇంకా ఏదో మిగిలే వుందనిపిస్తుంది. మనిషి చలనానికి, మనిషి మనుగడకు గుండె ఎంత ముఖ్యమో, ఆధునిక కాలంలో ఇంటికి ఇంటీరియల్ అంత ముఖ్యం, అయితే కిచెన్, బెడ్‌రూమ్, హాల్ ఇలా ప్రతి గదిలోనూ వస్తువుల్ని పెట్టుకోవడానికి ఎక్కడికక్కడే షెల్ఫ్‌లు ఉండేవి. బీరువాలు, చెక్క బీరువాలు, అల్మారాలు ఉపయోగించేవారు. ఇప్పుడు ఇవి కనుమరుగైపోతున్నాయి. బెడ్‌రూమ్ వార్డ్‌రోబ్‌ను సీజన్‌ను బట్టి అందంగా సర్దుకోవచ్చు. వేసవిలో అయితే అందుకు అనుగుణంగా వెలుతురు ప్రసరించేలా చూసుకోవాలి. చలికాలంలో ఉపయోగించే స్వెటర్లు, క్యాప్‌లు, మందంగా ఉండే దుస్తులను బయటకు కనిపించకుండా భద్రపరుచుకుంటే స్థలం చాలావరకూ మిగులుతుంది. వాటిని వేరువేరు షెల్ఫ్‌లో సర్దుకోవాలి. చాలా అరుదుగా వాడేదుస్తులు, వస్తువుల్ని అన్నింటికంటే పైషెల్ఫ్‌లో సర్దుకోవాలి. దుస్తులు, వస్తువులు అమరిక ఉంటే వార్డ్‌రోబ్ చూడడానికి అందంగా కనిపించడంతో పాటు, అవసరమైన వస్తువులూ వెతుక్కోవాల్సి న అవసరం ఉండదు. రోజువారీగా వేసుకునే దుస్తులు పిల్లలకు అందే షెల్ఫ్‌ల్లో అమర్చుకో వాలి. అకేషనల్‌గా వేసుకునే వాటిపై షెల్ఫ్‌ల్లో సర్దాలి. పిల్లల ఆటవస్తువులు కింద షెల్ఫ్‌ల్లో సర్దితే వారికి అందుబాటులో ఉంటాయి. చిన్నారులకు వారి వస్తువులు, దుస్తులు, పుస్తకాలు వారి షెల్ఫ్‌ల్లో సర్దుకునేలా ప్రోత్స హించాలి. చాలామంది వార్డ్‌రోబ్ పెద్దగా ఉంటేనే ఎక్కువ వస్తువులు పెట్టుకోవడానికి వీలుంటుందని, నీట్‌గా కనిపిస్తుందను కుంటారు. కానీ అది పొరపాటు. వార్డ్‌రోబ్ చిన్నగా ఉన్నా దాన్ని అందంగా సర్దుకోవచ్చు. ఒకవేళ మీకు దుస్తులు ఎక్కువగా ఉండి, సర్దుకోవడానికి తక్కువ స్థలం ఉందనుకుంటే ప్యాంట్,షర్ట్స్, చీరలు ఇలా కొన్ని దుస్తుల్ని హ్యాంగర్స్‌కు తగిలించి వార్డ్‌రోబ్‌లో అందంగా అమర్చుకోవచ్చు. ఇలా చేయడం వల్ల స్థలం సరిపోవడంతో పాటు చూసేందుకు కూడా ఆకర్షణీయంగా కనిపిస్తాయి. వేటికవే అందంగా కనిపిస్తాయి.

బెడ్‌రూమ్ వార్డ్‌రోబ్‌లో దుస్తులతో పాటు హ్యాండ్‌బ్యాగ్స్, లగేజ్ బ్యాగ్స్, నగలు ఇలా రకరకాల వస్తువుల్ని

**తరిగొప్పుల విఎల్లెన్ మూర్తి**

పెట్టుకుంటాం. మరి అన్నింటినీ కలిపి ఒకేచోట పెట్టుకుంటే చూడడానికి అస్సలు బాగుండవు. కాబట్టి అన్నింటినీ విడివిడిగా అరల్లో పెట్టుకుంటే చూసేందుకు అందంగా కనిపించడంతో పాటు ఎక్కువగా వెతికే పనిలేకుండా సులభంగా దొరికే అవకాశం ఉంటుంది. అలాగే వీటిలో కూడా రోజూ అవసరమైనవి, ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే కావాల్సినవి, ఇలా వేర్వేరుగా ఉంటాయి. ఇలాంటి వాటిని వేర్వేరుగా సర్దుకోవడం మంచిది. ఇలా వేటికవే అందంగా సర్దుకోవడం వల్ల వార్డ్‌రోబ్ చూసేందుకు చాలా ఆకర్షణీయంగా కనిపిస్తుంది. వార్డ్‌రోబ్ ఆకర్షణీయంగా సర్దగానే పని పూర్తయిందని అనుకుంటే పొరపాటే. ఎందుకంటే రోజూ ఆఫీసుకు వెళ్లేహడావుడిలో పడి సమయం సరిపోక వార్డ్‌రోబ్‌లో ఉండే దుస్తులు, బ్యాగ్స్ ఇలా వస్తువులన్నీ చిందరవందరగా పడేస్తుంటారు. సాయంత్రం ఇంటికి వచ్చాక సర్దుదామంటే మళ్లీ అవసరాలు చూసుకోవడం లాంటి పనులతోనే సరిపోతుంది. కాబట్టి రోజూ నీట్‌గా పెట్టుకోవడానికి సమయం ఉండదు. అందుకే వారానికోసారి సెలవు రోజున సమయం కేటాయించి వార్డ్‌రోబ్‌ను శుభ్రంగా, అందంగా సర్దుతుండాలి. లేదంటే కొన్ని రోజులకు వస్తువులన్నీ చిందరవందరగా తయారై అంతా గందరగోళంగా మారుతుంది. అలాగే వదిలేస్తే కొన్ని రోజులకు వాటిపై దుమ్ము కూడా చేరే అవకాశం ఉంటుంది. కాబట్టి ఇలా వారానికోసారి లేదంటే పదిహేను రోజుకోసారి సర్దుకోవడం వల్ల వార్డ్‌రోబ్ నీట్‌గా ఉండడంతో పాటు అందులో ఉండే వస్తువులు కూడా దుమ్ము పట్టకుండా శుభ్రంగా ఉంటాయి.



కొంతమంది ఫ్యాషన్‌తో రకరకాల వస్తువులు, బట్టలు కొని బీరువాలో సర్దేస్తారు. అవి పాతబడకుండానే మళ్లీకొత్తవి కొనేస్తారు. తర్వాత డబ్బు అనవసరంగా ఖర్చు పెట్టామని బాధపడుతుంటారు. అలాంటి వారు కూడా ఖర్చులేకుండా అందమైన వార్డ్‌రోబ్ తయారు చేసుకోవచ్చు. ఇక్కడ కూడా కాస్త ఖర్చు తగ్గించుకోవచ్చు. కొత్తడ్రెస్సులు కొనేబదులు, ఉన్నవాటితోనే అందమైన వార్డ్‌రోబ్ తయారు చేసుకోవచ్చు. వార్డ్‌రోబ్‌లో దుస్తులతో పాటు ఫ్యాషన్ ఐటమ్స్, నగలు, ఆభరణాలు, జుమ్కీలు మొదలైన వాటికి చోటు కల్పించండి. దుస్తులను సెలెక్ట్ చేసుకొనేటప్పుడు అందుకు మ్యాచ్ అయ్యే వస్తువులను కూడా కచ్చితంగా ఎంపిక చేసుకోండి. ఇలా చేయడం వల్ల పదేపదే పాత దుస్తులనే ధరిస్తున్నారనే ఫీలింగ్ మీకు రాదు. వార్డ్‌రోబ్‌కు కూడా కొత్తలుక్ వస్తుంది. తరచుగా వాడని దుస్తులు కూడా వార్డ్‌రోబ్ నుండి తీసేయండి. ఇక వార్డ్‌రోబ్‌లో పెట్టాలనుకున్న దుస్తులను పై అరనుండి కింది వరకు పెట్టుకుంటూ రండి. జాకెట్లు, స్కార్ఫ్‌లు వంటివి హేంగర్లకు వేస్తే తీసుకోవడం తేలిక. అవి కూడా నలగకుండా వుంటాయి. జీన్సు, పేంట్లు వంటివి వార్డ్‌రోబ్‌లో ఒక మూల పెట్టండి. జీన్స్ వంటి మందమైన దుస్తులను వరుసకు నాలుగు లేదా అయిదుకు మించి పెట్టకండి. టీషర్టులన్ని ఒకచోట ఉంచండి. అనవసరమైన టాప్‌లన్ని తీసేసి కొత్త దుస్తులకు చోటు కల్పించండి. తరచుగా ధరించే దుస్తులు వార్డ్‌రోబ్‌లో ముందు వరుస పెట్టండి. పార్టీలకు వేసుకువెళ్లే దుస్తులు ప్రత్యేక కవర్లలో పెట్టివుంచితే, శుభ్రంగాను, నలగకుండానే వుంటాయి. ప్రతిసారి డ్రైక్లినింగ్‌కు వేయాల్సిన పనికూడా వుండదు. ఇక అన్ని సర్దిన తర్వాత వార్డ్‌రోబ్ అరలలో తగినన్ని కలరా వుండలను వేయటం మరచిపోకుండి. ఇవి మీ దుస్తులను పురుగుల బారి నుండి, చెడు వాసనల నుండి కాపాడతాయి. ఉడెన్ వార్డ్‌రోబ్‌ను ఎటువంటి మరకలు, చారలు లేకుండా శుభ్రం చేయుటకు నునుపుగా ఉన్న మైక్రోఫైబర్ క్లాత్‌ను ఉపయోగించి శుభ్రం చేయడం ఒక సింపుల్ మార్గం. ఇది ఉడెన్ వార్డ్‌రోబ్ మీద ఎటువంటి చారలు పడకుండా సహాయపడతాయి. ఉడెన్ వార్డ్‌రోబ్ ఎక్కువ మురికి, దుమ్ము పట్టినట్లైతే, వైట్ వెనిగర్‌ను ఉపయోగించే శుభ్రం చేయడం ఒక సింపుల్ మార్గం. ఇది ఉడెన్ వార్డ్‌రోబ్ మీద ఎటువంటి చారలు పడకుండా సహాయపడతాయి. ఒక్కో సీజన్‌కి ఒక్కో రకం దుస్తులు వాడుతుంటాం. సీజన్‌కి అనువుకాని షూస్, దుస్తుల కోసం అరలు పారదర్శకంగా ఉన్నవి అయితే మరీ మంచిది. అవసరం పడినపుడు ఎక్కడవున్నా గుర్తించవచ్చు. ప్రతీనెల మీరు వార్డ్‌రోబ్‌ని సర్దుకొనే విధానంలో మార్పులు చేస్తే చాలా ఫలితాలుంటాయి. బట్టలు రీవరేంజ్ చేసేటప్పుడు మీకు నచ్చిన వాటిని తొలి వరుసలో పెట్టి పెద్దగా నచ్చని వాటిని వెనుక వరుసలో పెట్టండి. అలాగే కొని కూడా వాడని దుస్తులను మొదటి వరుసలో పెట్టి ఎక్కువగా వాడిన వాటిని వెనుక వరుసలో పెట్టండి. ఇలా చేయడం వల్ల ఎప్పుడూ ఒకే వార్డ్‌రోబ్‌ని చూస్తున్న ఫీలింగ్ కలగదు. వార్డ్‌రోబ్ సర్దడం ఒక ఎత్తైతే కలర్ కాంబినేషన్ ఆధారంగా అందులో డివిజన్స్ ఏర్పాటు చేయడం మరో ఎత్తు. వార్డ్‌రోబ్‌లో దుస్తులతోపాటు ఫ్యాషన్ ఐటమ్స్, నగలు, ఆభరణాలు, జుమ్కీలు మొదలైన వాటికి చోటు కల్పించండి. మ్యాచ్ అయ్యే వస్తువులను కూడా కచ్చితంగా ఎంపిక చేసుకోండి. వారానికోసారి సెలవు రోజున కాస్త సమయం కేటాయించి వార్డ్‌రోబ్‌ను శుభ్రంగా, అందంగా సర్దుతుండాలి. అలాగే వదిలేస్తే కొన్ని రోజులకు వాటిపై దుమ్ము కూడా చేరే అవకాశం ఉంటుంది. తలుపులు లేని వార్డ్‌రోబ్ ఉందనుకోండి. అందులో ఉండే వస్తువులకు ఎక్కువగా దుమ్ము పట్టే అవకాశం ఉంటుంది. అలాగే అవన్నీ బయటకు కనిపిస్తుంటాయి. వార్డ్‌రోబ్ ఉండే ప్రదేశంలో లైటింగ్ కూడా ఏర్పాటు చేయాలి. లేదంటే రాత్రిపూట మీకేమైనా వస్తువులు కావాలనుకుంటే సరైన వెలుతురు లేక వస్తువులను వెతుక్కోలేక ఇబ్బంది పడాల్సి వస్తుంది. కాబట్టి లైటింగ్ వల్ల వస్తువులు దొరకడంతో పాటు వార్డ్‌రోబ్ కూడా శోభాయమానంగా కనిపిస్తుంది.



కథ

# సమ భావన

గాంధీనగర్‌లో రామ్మోహన్ ధనికుల్లో ఒకడు. అతని కొడుకు శ్రీకాంత్. కొడుకుని అల్లారుముద్దుగా పెంచాడు రామ్మోహన్. శ్రీకాంత్ ఏది అడిగితే అవి కొని పెడుతూ ఉంటాడు తండ్రి. ప్రతిరోజూ శ్రీకాంత్ ధనికులతోను, వారి పిల్లలతో తిరగడం, ఆడడం ఇంకా స్కూల్‌కి వెళ్లడం ఇది వాడి జీవనవిధానం. ఒకరోజు తండ్రి సెల్‌ఫోన్ కొని వాడికి ఇచ్చారు. అప్పటి నుంచి బడిలోని పేద పిల్లలంతా శ్రీకాంత్ చుట్టూరా తిరుగుతూ ఉంటారు. ఇంతవరకు ధనికుడైనా అహంకారం లేని మంచి బాలుడు శ్రీకాంత్. అప్పుడప్పుడు పేద స్నేహితుల ఇంటికి వెళుతూ ఉండేవాడు శ్రీకాంత్. వారివారి జీవన విధానం గమనిస్తూ ఉండేవాడు. పేద స్నేహితులకి తిండి, బట్టలు సరిగా ఉండేవి కావు. వారిని చూసి జాలిపడేవాడు శ్రీకాంత్. ఇలా ఉండగా, తండ్రి రామ్మోహన్ శ్రీకాంత్‌కి ప్రతి సంవత్సరం పుట్టినరోజు ఒక పండగలా జరుపుతారు. ఈసారి తండ్రితో శ్రీకాంత్ 'తన పేద స్నేహితులందరినీ పిలుస్తాను' అని కోరాడు. దానికి తండ్రి చాలా సంతోషించి, వారందరినీ పిలుస్తారు. వారందరికీ భోజనాలు, బట్టలను కానుకలుగా ఇస్తాడు. స్నేహితులంతా చాలా సరదాగా గడుపుతారు. అది చూసి శ్రీకాంత్ చాలా ఆనందపడతాడు. ఆనాటి నుండి అతని మనసులో ప్రతి ధనికుడు పేదవారిని ఆదుకుంటే బాగుండును అని ఆలోచిస్తాడు. అలా కొంతకాలానికి తన చదువు పూర్తి చేసుకుని ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకి వెళ్తాడు శ్రీకాంత్. అతడికి ఉద్యోగం రాలేదు. ధనికుడైన తండ్రి రామ్మోహన్ ఒక పెద్ద పరిశ్రమను స్థాపించి, శ్రీకాంత్‌ని మేనేజర్‌గా చేస్తాడు. అప్పుడు శ్రీకాంత్ వేల మంది పేదలకు తన కంపెనీలో ఉద్యోగాలు ఇచ్చి తన పేద స్నేహితులందరికీ అండగా నిలుస్తాడు. శ్రీకాంత్ ఇలాంటి పరిశ్రమలు ఎన్నో పెట్టి పేదవారికి అండదండగా ఉండి తండ్రి చేత శభాష్ అనిపించుకుంటాడు. ధనికులు చదువుతో పాటు సమాజంలో సమభావనతో మంచి మనసుతో పేదవారిని ఇలా ఉద్ధరించవచ్చు.



– బళ్ల కృష్ణవేణి

## రంగులు వేయండి




# చిన్నారుల హరివిల్లు

వార్త ఆదివారం

## బాలగేయం

### పరీక్షల సీజన్



కొత్త సంవత్సరం
వచ్చేసింది
జనవరి మాసం
కూడా అయిపోతుంది
ఫిబ్రవరి అంటేనే
పరీక్షల సీజన్ వచ్చినట్టే!
అందరూ పరీక్షల
హడావుడిలో ఉన్నారు
మేం కూడా
పరీక్షల కోసం
సిద్ధపడుతున్నాం
మంచి మార్కులే
మా లక్ష్యం
మంచి భవిష్యత్తే
మా గమ్యం
ఆటపాటలకు
కొంత బ్రేక్ ఇస్తాం
మంచి ఆహారం
భుజిస్తాం, ఆరోగ్యంగా
పరీక్షల కోసం
సన్నద్ధం అవుతాం.

**- రూతు**

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- కె. బాలమణి,** కొత్తూరు

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. భోజనం చివర అరటిపండు తినే అలవాటు మంచిదా? కాదా?**

**జవాబు: బాలమణి!** వండిన పదార్థాలు సహజంగానే జీర్ణం కావడానికి కొంత సమయం పడుతుంది. పండ్లలో విటమిన్‌లు, ఖనిజ లవణాలు అధిక స్థాయిలో ఉండటంతో తిన్న కొద్దిసేపటికే జీర్ణమవుతాయి. వండిన పదార్థాలతో పాటు పండ్లను కూడా తింటే కడుపులో అవి వెంటనే జీర్ణం కాలేక, మిగిలిన పదార్థాలు జీర్ణమయ్యే వరకూ వేచి చూడాల్సి వస్తుంది. ఫలితంగా పండ్ల నుంచి తిన్న వెంటనే లభించవలసిన పోషక పదార్థాలన్నీ పూర్తిగా శరీరానికి లభించక వృధా అవుతాయి. భోజనం చేసిన తర్వాత ఒకటిన్నర/రెండు గంట లకు తిన్న ఆహారం రక్తంలోకి మారుతుంది. ఆ తర్వాతే మంచినీళ్లు పుష్కలంగా తాగాలి. పండ్లూ తినవచ్చు. భోజనం చేసిన తరువాత కనీసం ఒక గంట తర్వాత పండ్లు తినవచ్చు. అప్పుడే వాటి పోషక విలువలు శరీరానికి అందుతాయి.

**- సి.పంకజ్,** గుంటూరు


**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. హిమాలయాలు ఏర్పడక ముందు అక్కడ ఏమి వుండేది?**

**జవాబు: పంకజ్!** మన దేశానికి ఉత్తర దిక్కులో వున్న హిమాలయాల భాగంలో అతి ప్రాచీన కాలంలో టెథీస్ సముద్రం వుండేది. ఈ కారణంతోనే టిబెటన్ (టెథీస్) హిమాలయాలని ఒక దిశగా వున్న వాటిని పిలుస్తారు. మిగిలినవి గ్రేటర్ హిమాలయాలు (హిమాద్రి), లెస్సర్ హిమాలయాలు (హిమాచల్), శివాలిక్ కొండలు. ఉత్తర, దక్షిణాలుగా నాలుగు సమాంతర పర్వత పంక్తులతో హిమాలయాలు వున్నాయి.



# పింక్‌సాల్ట్ మంచిదేనా?

ఈమధ్య ఎక్కడ చూసినా గులాబీరంగులో ఉప్పు కనిపిస్తుంది. ఉప్పు అనగానే మనకు తెల్లటి ఉప్పు అనేది మాత్రమే మనకు తెలుసు. కానీ ఇటీవల బ్లాక్ సాల్ట్, పింక్‌సాల్ట్ అనే పేర్లు మనకు వినిపిస్తున్నాయి. గులాబీరంగు ఉప్పు పొడి, కల్లు ఉప్పు రూపంలో లభ్యమవుతున్నది. దీనిమీద హిమాలయ పింక్ సాల్ట్ లేదా సైంధా నమక్ (సైంధవ లవణం) అన్న లేబుల్ కనిపిస్తుంది. అంతేనా, ఒకప్పుడు ఊళ్లలోకి ఉప్పు బండ్లు వచ్చినట్లే ఈమధ్య పెద్దపెద్ద గులాబీరంగు ఉప్పు రాళ్లనీ ట్రక్కుల్లో తెచ్చి నగరాల్లోనూ పట్టణాల్లోనూ అమ్ముతున్నారు. దాంతో ధర ఎక్కువైనా చాలామంది ఇష్టంగానో



కష్టంగానో దీన్ని కొంటున్నారు. అదేమని అడిగితే..ఆరోగ్యానికి మంచిదనీ చెబుతున్నారు. పోషక నిపుణులు సైతం అందులో నిజం లేకపోలేదనీ అంటున్నారు. ఉప్పు లేని పప్పేకాదు, ఏ వంటయినా చప్పగానే ఉంటుంది (ఒక్క మిఠాయిలు తప్ప). ఎన్ని దినుసులు ఉన్నా కూరలో ఉప్పు లేకపోతే సహించదు. అలాగని ఉప్పు రుచి కోసమేనా అంటే కాదనే చెప్పాలి.

శరీరం నిర్వహించే రోజువారీ విధులకు ఉప్పు అవసరమే. అందులోని సోడియం ఎలక్ట్రోలైట్‌లా పనిచేస్తుంది. నరాల ప్రేరణకీ, కండరాల సంకోచానికీ, కణాల్లో నీరు, ఖనిజాల సమతుల్యతకీ శరీరానికి ప్రతిరోజూ 500 మి.గ్రా. సోడియం కావాలి. అందుకే ఆరోగ్యవంతులు రోజుకు 2300 మి.గ్రా సోడియం క్లోరైడ్ (ఉప్పు)ను తీసుకోవచ్చని 'అమెరికన్ హార్ట్ అసోసియేషన్ చెబుతోంది. ఇది ఒక టీస్పూను (5గ్రా) ఉప్పుతో సమానం. ఇంతకు మించి తింటే ముప్పు తప్పదు అంటోంది ప్రపంచ ఆరోగ్య సంస్థ. బీపీ ఉన్నవాళ్లయితే 1500 మి.గ్రా (3.75) కన్నా తక్కువ తింటేనే మంచిదట. అయితే సముద్ర నీటిని సూర్యరశ్మికి ఎండబెట్టి తయారు చేసే సముద్రపు ఉప్పులోనూ సోడియంతోపాటు కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం..వంటి ఖనిజాలు కొద్దిపాళ్లలో ఉంటాయి. కాబట్టి ప్రస్తుతం వాడుకలో ఉన్న తెల్లఉప్పూ ఆరోగ్యానికి మంచిదే. అయితే అందులోని మలినాలను శుద్ధి చేసే ప్రక్రియలో సోడియం మినహా మిగిలిన ఖనిజాల శాతం తగ్గిపోతుంది. అదే ప్రకృతే స్వయంగా ఏర్పరచిన హిమాలయన్ పింక్‌రాక్ సాల్ట్‌లో సోడియం క్లోరైడ్‌తోపాటు పొటాషియం, మెగ్నీషియం, ఐరన్, సిలికాన్, బేరియం..వంటి మూలకాలూ కొద్దిపాళ్లలో ఉంటాయి. అందుకే దీన్ని సహజ ఉప్పు అనీ, సముద్ర ఉప్పుకన్నా మంచిదనీ చెబుతున్నారు. పైగా ఇందులో అయొడిన్ కూడా స్వల్పంగా ఉంటుంది. అయితే థైరాయిడ్ సమస్యల నివారణకు అది చాలదన్న కారణంతో కొన్ని కంపెనీలు టేబుల్ సాల్ట్‌లో మాదిరిగానే పింక్‌సాల్ట్‌కీ అయొడిన్‌ను చేరుస్తున్నాయి. నిజానికి సముద్ర ఉప్పు కూడా అందులోని ఖనిజాలూ మలినాలను బట్టి తెలుపు, బూడిద, లేత గులాబీరంగుల్లోనే ఉంటుంది. శుద్ధి చేయడంతో తెల్లగా మారిపోతుంది. కానీ హిమాలయన్ సాల్ట్ లేత గులాబీ రంగులో ఉంటుంది. అయితే ఈ ఉప్పురాళ్ల కూడా తెలుపు, నారింజ, బూడిద, ఎరుపు..ఇలా భిన్న రంగుల్ని కలిగి ఉంటాయి. అవన్నీ కలిపి కొట్టినప్పుడు అది లేతగులాబీ నుంచి లేత నారింజ వర్ణాలను సంతరించుకుంటుంది. సముద్ర ఉప్పుతో పోలిస్తే ఇది కాస్త తియ్యని రుచితో ఉంటుంది. పైగా ఈ ఉప్పురాళ్లతో గ్లాసులు గిన్నెలు కూడా చేస్తున్నారు. చికెన్, చేపలు..వంటివాటిని వీటిమీద కాలిస్తే రుచిగా ఉంటాయన్న కారణంతో కొన్నిచోట్ల ఈ ఉప్పురాళ్లను వంటపాత్రలు లేదా గ్రిల్‌గానూ కూడా వాడుతున్నారు.

## ఉప్పు ఎలా మొదలైంది?

సుమారు యాభైకోట్ల సంవత్సరాల క్రితం అంటే మానవజాతి ఆవిర్భవించక ముందు లోతట్టు సముద్రంలోని నీరంతా ఆవిరైపోయింది.

అందులోని ఖనిజాలు మాత్రం ఉండిపోయాయి. కాలక్రమంలో భూమిలోని పొరలన్నీ అటూఇటూ కదలడంతో ఆ సాగర గర్భం కాస్తా భూభాగంలోకి చొచ్చుకువచ్చి, నేలమాళిగల్లోకి చేరి మూసుకుపోయింది. దానిమీద పేరుకున్న రాళ్లూ మంచుతో నిండిన పర్వతాలతో కాలుష్యంబారిన పడకుండా లోపల మరిన్ని ఖనిజాలను కలుపుకుని సురక్షితమైన గనిలా రూపుదిద్దుకుంది. పురాతనమైన ఆ ఉప్పు గని పేరే ఖేవ్రా. ప్రస్తుత పాకిస్తాన్‌లోని హిమాలయాలకు దక్షిణంగా ఉన్న పొటోహార్ పీఠభూమికి దిగువన ఉన్న ఉప్పు పర్వతశ్రేణిలో ఉంది. దీన్నే 'మాయో సాల్ట్‌మైన్' అనీ అంటారు. అక్కడే కాలాబాగ్, వార్చా అని మరికొన్ని గనులూ ఉన్నాయి. సముద్ర ఉప్పు తెలియకముందే ఏర్పడిన సహజఉప్పు అన్నమాట. క్రీ.పూ ఆరువేల ఏళ్లకాలంలోనే మనిషి నీటి నుంచి ఉప్పు తయారీ నేర్చుకుని ఆహార పదార్థాలను నిల్వచేసుకునేవాడు. క్రీ.పూ.320ల్లో కావచ్చు. భారతావని మీద దండెత్తిన అలెగ్జాండర్-ఖేవ్రా ప్రాంతంలో తన సైనికులతో విశ్రాంతి తీసుకుంటున్నాడట. ఆ సమయంలో దాహంతో అలసిన గుర్రాలు అక్కడి కొండల్ని నాకడాన్ని ఓ సైనికుడు గుర్తిం చారట. వెంటనే దాన్ని తవ్వి చూడగా ఉప్పు నిక్షేపాలు ఉన్నాయన్న విషయం బయటపడిందట. ఆ తరువాత స్థానిక జుంజువా వంశీయులు ఈ ఉప్పును తవ్వేవారు. కానీ మొఘల్స్ కాలంలోనే అక్కడ ఉప్పు తవ్వకం అనేది ఓ వ్యాపారంగా మారింది. అప్పటి నుంచీ దాన్ని తవ్వుతూనే ఉన్నారు. 1870లలో బ్రిటిషర్లు ఇక్కడ ఓ సొరంగాన్ని నిర్మించడంతో ఇది మరింత వెలుగులోకి వచ్చింది. స్వాతంత్ర్యానంతరం 1974లో పాకిస్తాన్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ గనిని స్వాధీనం చేసుకుని, ఏడాదికి మూడున్నర లక్షల టన్నుల ఉప్పును ఉత్పత్తి చేస్తుంది. అయితే ఆ దిగుబడిని మరింత పెంచడంతోపాటు అక్కడే శుద్ధి చేసి, భారీయెత్తున దిగుమతి చేసుకునేందుకు తాజాగా ఓ అమెరికన్ కంపెనీ పాకిస్తాన్‌లో 20 కోట్ల డాలర్ల పెట్టుబడి పెట్టాలను







కోవడంతో ప్రపంచవ్యాప్తంగా అనేక సంస్థలు ఈ పింక్‌సాల్ట్ వైపుచూస్తున్నాయి.

## అందం-ఆరోగ్యం

సముద్ర ఉప్పులో 97-99శాతం సోడియం క్లోరైడ్ ఉంటే పింక్ సాల్ట్‌లో 98శాతం ఉండటంతోపాటు అదనంగా 84 రకాల ఖనిజాలూ, స్ట్రాన్షియం, మాలిబ్డినమ్ వంటి అరుదైన మూలకాలూ ఉంటాయట. ఇందులోని ఐరన్ వల్ల దీనికా రంగు వస్తుంది. అందుకే ఇది బీపీ నియంత్రణకీ రక్తప్రసరణకీ జీర్ణశక్తి మెరుగుయ్యేందుకూ ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించేందుకూ తోడ్పడుతుందని కొందరు నిపుణుల అంటున్నారు. గులాబీ ఉప్పులోని ఖనిజాలు కణాల్లో అధికంగా ఉన్న నీటిని తొలగిస్తాయి. దాంతో శరీరంలోకి నీరు చేరడం, పొట్ట ఉబ్బరం..తగ్గుతాయి. ఫలితంగా బరువూ తగ్గుతారు. డీహైడ్రేషన్, ఎలక్ట్రోలైట్ల లోపం, కండరాల బలహీనత వంటి కారణాల వ్ల కొందరికి తరచూ కండరాలు పట్టేస్తుంటాయి. అలాంటివాళ్లకి ఈ ఉప్పులోని ఎలక్ట్రోలైట్లవల్ల ఆ సమస్య తగ్గుతుందనీ, ముఖ్యంగా ఇందులోని మెగ్నీషియం కండరాల సంకోచాన్ని తగ్గిస్తుందనీ నిపుణులు చెబుతున్నారు. అలాగే తరచూ డీహైడ్రేషన్‌తో బాధపడేవాళ్లు షర్బత్‌లాంటి పానీయాల్లో చిటికెడు పింక్‌సాల్ట్ వేసుకుని తాగితే ఫలితం ఉంటుందట.

☛ గులాబీ ఉప్పు శరీరంలో సెరటోనియన్ శాతాన్ని పెంచడం ద్వారా డిప్రెషన్, ఒత్తిడి, ఆందోళనల్ని తగ్గిస్తుందనీ అంటున్నారు.

☛ ఇందులోని ఖనిజాల కారణంగా రక్తప్రసరణ మెరుగవుతుందనీ తద్వారా అన్ని అవయవాలూ చక్కగా పనిచేస్తాయనీ, హృద్రోగాలను తగ్గిస్తుందనీ, ఎముకలు ఆరోగ్యంగా ఉండేలా చేస్తుందనీ కూడా చెబుతున్నారు.



☛ ఈ ఉప్పు కలిపిన నీళ్లతో స్నానం చేస్తే అందులోని మెగ్నీషియంను శరీరం గ్రహించడంతో ఎముకలు, బంధన కణజాలాలు ఆరోగ్యవంతమైన కండర నొప్పులు తగ్గుతాయట.

☛ చర్మం మీద ఉన్న మట్టినీ టాక్సిన్లనీ గ్రహించి మృదువుగా ఉంచుతుందన్న కారణంతో చర్మసంరక్షణలో స్క్రబ్, ఫేస్‌మాస్క్ లుగానూ ఈ ఉప్పును వాడుతున్నారు. ముఖ్యంగా చలికాలం లో కొబ్బరినూనె పింక్‌స్టాల్ కలిపి రుద్దితే చర్మం పొడిబార కుండా ఉంటుంది. ఎగ్జిమా వంటి చర్మ వ్యాధుల్నీ తగ్గించడం తోపాటు సహజ డియోడరెంట్‌గానూ కూడా పనిచేస్తుంది. ❑

కథ

# కాలచక్రం

సింగంపల్లి శేష సాయి కుమార్

**ఎక్కడ చూసినా ఒకటే డప్పుల చప్పుళ్లు.. ఎంత గొమ్మున ఉందాం అనుకున్నా పాదాలు దానంతటట అవే లయబద్ధంగా ఊగుతున్నాయి. వీధులన్నీ జనాలతో నిండి కదులుతున్న చీమల దండులా కనిపిస్తున్నాయి. కొందరు కుటుంబంతో, మరికొందరు స్నేహితులతో, ఇంకొందరు వీధిలోని వారితో జట్లు, జట్లుగా పోతా వుండారు.**

నుదుటికి రంగు రంగుల రిబ్బనులు, తల నుండి కాళ్లదాకా బొగ్గు మసి పూసుకుని మధ్యలో సున్నపుబొట్లు పెట్టుకొని కొందరు, ఒళ్లంతా గంధం పూసుకుని మధ్యలో కుంకుమ బొట్లు పెట్టుకొని మరికొందరు, రెండు చేతుల్లో వేపమండలు, మొలకు వేపమండలు కట్టుకొని ఇంకొందరు.

తలపై వేయి కళ్ల కుండ అందులో ఓ పెద్ద బిళ్ల కర్పూరం వెలిగించుకొని గుడి చుట్టూ మూడు చుట్లు చుట్టి దానిని అక్కడున్న పెద్దమ్మ చేత దిష్టి తీయించుకొని గోడకేసి కొట్టి ఓ పది రూపాయలు ఆమె చేతిలో పెట్టి గంగమ్మ దర్శనానికి వరుసలో తోసుకుని, తోసుకుని నిలబడితే ఏ రెండు గంటలో పడుతోంది అమ్మను చూడటానికి.



ఊరు ఊరంతా గంగమ్మ జాతర చేసుకుంటూ అంబలి తాగుతుంటే, మణి మాత్రం చుక్క చుక్క చెమట చిందిస్తూ కోటకొమ్మల వీధిలో రెండో అంతస్థుకు ఇసుక మోస్తున్నాడు. "ఏమబ్బా, అందరూ ఈరోజు గంగమ్మ గుడికాడ ఉంటే నువ్వు మాత్రం దుడ్డు కోసం మా ఇంటికాడ ఉండావే?" అన్నాడు యజమాని.

"అన్నా! అమ్మ యాడికి పోతాది, ఐనా అమ్మ నాకేమైనా కొత్తనా ఏంది? నేను ఎప్పుడు పోయినా అమ్మ చూస్తాది" అంటూ గోళంలో ఇసుక నెతికి ఎత్తుకున్నాడు మణి.

మణిది తిరుపతి పక్కన వడమాల పేట. బాగా బతికిన రైతు కుటుంబం. అప్పుడప్పుడే అందరూ పంటలు పండే భూమిని చదును చేసి ఎర్రమట్టి తోలి, ప్లాట్లు వేసి అమ్ముతున్నారు. అదే మోజులో పడి ఉన్న ఎకరాని డబ్బుకు అమ్మేశాడు మణి.

లక్షుమక్క ఎప్పుడు ఒకచోట కుదురుగా ఉండదంటారు. ఇక్కడా అదే జరిగింది. వచ్చిందంతా వచ్చినంత సులువుగా పోయింది. చివరకు ఊళ్లో చేసుకోవడానికి పని లేక తిరుపతిలో పనికొస్తున్నాడు.

.........

రాత్రి పది దాటింది. ఉదయం మొదలైన జాతర సంబరాలు ఇంకా తగ్గలేదు. చాటింపు జరిగి రెండు రోజులు అవుతోంది. ఇండ్లలోకి బంధువుల రాక ఇక మెల్ల మెల్లగా మొదలవుతుంది. ఇంతలో నడి రాత్రి కావొచ్చింది. 108 కుయ్... కుయ్ మంటూ వచ్చి ప్రయివేటు ఆసుపత్రి దగ్గర ఆగింది. అందులో నుంచి ఒక 10 సంవత్సరాల వయసుగల పాప తల నిండా రక్తంతో తడిసి ముద్దైపోయింది.

ఉలుకూ పలుకూ లేదు, చేతికి అంబులెన్స్‌లో నుంచే సెలైన్ బాటిలు పెట్టి ఉంచారు. రోడ్డు దాటుతుంటే పెద్ద బండి కొట్టేసిందట. అక్కడే ఉన్న డాక్టర్‌కు చూపిస్తే కాసేపు ఏం పర్వాలేదు అని చెప్పి, కొంతసేపటికి తిరుపతికి పొమ్మన్నారంట.

లోపల ఐసియులోకి తీసుకెళ్లారు పాపని. బయట బోరుమని ఏడుస్తున్నారు తల్లిదండ్రులు.

ఓ అరగంటకు బయటకొచ్చిన ఒక పెద్ద డాక్టరు "చూడండి.. బిడ్డకు బాగా రక్తం పోయింది, రక్తం ఎక్కించాలి. ప్రస్తుతం మా దగ్గర ఉన్నదాంతో ఎక్కించాం. మీరు రేపు ఎలాగైనా సరే సిద్ధం చేసుకోవాలి. అలానే డబ్బు కూడా దగ్గర పెట్టుకోండి" అంటూ చెప్పి తన గదికి వెళ్లిపోయాడు.

కూలీ నాలి చేసుకొని బతికేటోళ్లం.. రక్తం, డబ్బు ఇప్పటికిప్పుడు ఎవరిస్తారు? అంటూ లోలోపల కుమిలిపోతున్నారు ఇద్దరూ. వాళ్ల కన్నీళ్ల జడి ఇంకా ఆగలేదు కానీ అప్పుడే సూర్యుడు ఉదయించేశాడు. డాక్టర్లు ఆ పరీక్ష, ఈ పరీక్ష చేసేలోపు ఎక్కడి నుండి వచ్చిందో తెలియదు కానీ నర్సులు రెండు రక్తం ప్యాకెట్లను తెచ్చి స్టాండ్‌కు బిగించారు.

ఏం జరుగుతుందో అర్థంకాక చూస్తున్నారు మణి, అతని భార్య మంగ.

అవును.. ఆ పాప మణికూతురు. నిన్న జరిగిన దానికి మనసులో ఒకటే ఆలోచన "ఎందుకు దేవుడు నాకీ ఈ పరీక్ష పెట్టాడు. రోజూ వచ్చే కూలితో సంతోషంగా బతుకుతున్నాం. ఉన్నదాంట్లో తృప్తి కలుగుతోంది.

బిడ్డ కళ్ల ముందు కదులుతూ వుంటే మా ఇంటికి దేవత వచ్చినంత సంతోషం కలిగేది. అలాంటిది ఇప్పుడు కదలలేని స్థితిలో ఉన్న బిడ్డను చూస్తుంటే కన్నీరు ఆగడం లేదు.

మెల్లగా పాప స్పృహలోకి వచ్చింది. కనులు తెరచి చూడటం చేస్తోంది. చేతులతో అమ్మ, నాన్నలను పిలుస్తోంది. కానీ ఆ సంతోషం కన్నా బిడ్డకు రక్తం ఎవరిచ్చారో తెలుసుకోవాలన్న ఆతృత ఎక్కువైపోతోంది.

ఆదరా, బాదరా వెళ్లి డాక్టర్ గారిని కలిసాడు "సార్.. మా పాపకు రక్తం దానం చేసింది ఎవరు?" అన్నాడు మరోమారు.

"ఎందుకు అన్ని సార్లు అడుగుతున్నావు? నిన్న రాత్రి పాపను హాస్పిటల్‌కు తీసుకువచ్చినప్పుడు ఇక్కడే ఉన్న ఇన్ పేషంట్ బంధువుల పిల్లాడు ఒకరు చూసారంట. రక్తం అవసరమని నర్సులు అంటుంటే విని అతను వచ్చి ఇచ్చాడు, అతన్ని చూసి ఇంకో వ్యక్తి కూడా రక్తం ఇచ్చి వెళ్లాడు" అన్నారు డాక్టర్.

"వాళ్లతో ఒకసారి మాట్లాడతాం సార్. అడగకుండానే అంత సాయం చేసిన వాళ్లకు కృతజ్ఞత చెప్పడం ధర్మం కదా సార్" అంటూ అడిగేసరికి పక్కనే ఉన్న కాలింగ్ బెల్లు కొట్టి వచ్చిన అటెండర్‌తో "వీళ్లకు నిన్న బ్లడ్ ఇచ్చిన వాళ్లను చూపించు" అని చెప్పి పంపాడు.

ఇద్దరూ అలా చల్లని ఏ.సి. గదిలో నుంచి బయటకు వచ్చి అతన్ని అనుసరిస్తూ వెళ్తున్నారు. ఒక గది ముందు ఆగి "అదిగో అతనే మీరు అడిగిన వ్యక్తి" అంటూ చేయి చూపించి వెళ్లిపోయాడు.

**"మిమ్మల్ని ఇదివరకు ఎక్కడైనా చూశానా బాబు?" అన్నాడు మాట పెంచడానికి మణి. "ఎందుకు మీరు ఇంత చిన్న విషయానికి అన్ని సార్లు చెప్తున్నారు" అన్నాడు ఆ కుర్రాడు.**

అతన్ని ఎక్కడా చూసిన గుర్తు రావడం లేదు. నిజంగా కొత్త ముఖాలే. అసలు వీళ్ల ఎవరు కనుక్కుందామన్న ఆత్రుత ఇంకా వారి కళ్లల్లో కనపడుతూ ఉంది.

"మీరు చేసిన సాయం ఎప్పటికీ మరచిపోలేం బాబు, వయసులో నా కన్నా చిన్నవారు అందుకే మీకు నమస్కారం చెప్పలేదు" అన్నాడు మణి.

"మీరు నాకేం చెప్పక్కర్లేదు" అన్నాడు ఆ కుర్రాడు.

"మిమ్మల్ని ఇదివరకు ఎక్కడైనా చూశానా బాబు?" అన్నాడు మాట పెంచడానికి మణి.

"ఎందుకు మీరు ఇంత చిన్న విషయానికి అన్ని సార్లు చెప్తున్నారు" అన్నాడు ఆ కుర్రాడు.

"మేం నీకు కృతజ్ఞతలు చెబుతున్నది రక్తం ఇచ్చినందుకు మాత్రమే కాదు, మేం కట్టాల్సిన హాస్పిటల్ బిల్లు కూడా మీరు కట్టారు అందుకు" అన్నాడు మణి.

"అదేముంది" అంటూ నవ్వుతూ కూర్చోమని సైగ చేసాడు ఆ కుర్రాడు.

"మేం ఇక్కడికి మా అమ్మకు ఆరోగ్యం బాగో లేకపోతే చూపించుకోవడానికి వచ్చాం. మా నాన్న మీ ఊరి దగ్గర ఉన్న పొలాన్ని కొని అక్కడ ఫ్యాక్టరీ పెట్టారు. నిన్న మీరు పాపను తీసుకు వస్తుంటే చూసి నాతో చెప్పారు ఇదంతా" అన్నారు.

ఇంతలో ఏర్పడిన మరో నిశ్శబ్దాన్ని తొలగిస్తూ "బాగా పంటలు పండే భూములను మేం కొని, అక్కడ ఫ్యాక్టరీ పెట్టాం. ఇప్పుడు ఆ చుట్టుపక్కల పంటలు పండటం లేదు. మాకు పరిశ్రమల నుండి బాగా డబ్బు వస్తున్నా, చుట్టుపక్కల గ్రామాల వాళ్లకు అందులో ఉద్యోగాలు ఇస్తున్నా పచ్చని భూమిని పనికి రాకుండా చేసేసాం.

నేను ఒక కాలుష్య నివారణా సేవా సంస్థలో వీటిపై ఒకవైపు పోరాడుతుంటే మరోవైపు మా ఇంట్లోనే వీటిపై అవగాహన కల్పించలేకపోతున్నాను. అందుకే కొన్ని తెలిసి చేసిన తప్పులను తెలియనీయకుండానే తీర్చుకోవడానికి ఇలా అప్పుడప్పుడు.." అని లేచి నిల్చున్నాడు.

.........

ఈ ఏడాది రివ్యూ మీటింగ్‌కు మన డైరెక్టర్‌గారు వస్తున్నారు. ఆయన చెప్పిన అన్ని ప్రాజెక్టులపై నివేదికలు సిద్ధం చేసి పెట్టారు. ఆ నివేదికలన్నీ కూడా కంపెనీ మేనేజర్ గారి టేబుల్‌పై పెట్టారు.

ఆ పేపర్లు అన్నీ జాగ్రత్తగా తీసుకొని మీటింగ్‌కు వెళ్లి కూర్చుంది శ్రావణి.

"ఇక్కడ ఈరోజు చర్చించాల్సిన ముఖ్య విషయం మన ఫ్యాక్టరీని విస్తరించడానికి భూమి సేకరించాలి. అందుకు కావలసిన ఏర్పాట్లన్నీ చాలా వేగంగా చేయాలి" అన్నాడు డైరెక్టర్.

అందరూ "సరే" అన్నట్టు తలలు ఊపారు. శ్రావణి మాత్రం "ఒక్క విషయం.. ఇక్కడ మీ అనుమతితో చెప్పదలచుకున్నాను" అంటూ అనుమతి కోరింది.

"చెప్పమన్నట్టు..." సైగ చేసి కుర్చీలో కూర్చున్నాడు డైరెక్టర్ ఆదిశేషు.

"సర్... నాదొక చిన్న సలహా. మనం ఇప్పటివరకు చాలా వ్యవసాయ ఆధారిత ఫ్యాక్టరీలు పెట్టాం. కానీ అవి పెట్టడానికి కావలసిన భూమిని మాత్రం వ్యవసాయ దారుల నుండి తీసుకొని వ్యవసాయం చేయనీయకుండా చేస్తున్నాం. ఇలా ఇంకొద్ది సంవత్సరాలు మనం, మన లాంటి ఇతర కంపెనీలు చేస్తే మన ఫ్యాక్టరీల మనుగడ కష్టంగా మారే ప్రమాదం ఉంది" అంటూ ఇంకేదో చెప్పబోయింది.

"అయితే ఇప్పుడు మనం ఏం చేస్తే బాగుంటుందో చెప్పు" అన్నారు డైరెక్టర్ సూటిగా.

"థ్యాంక్యూ సర్. నేను ఆ విషయాన్ని చెప్పడానికే ఇక్కడ సిద్ధమయ్యాను. మన కంపెనీ మంచి లాభాల్లో నడిచి పది మందికి మంచి చేయాలంటే ఇప్పుడు మనం కొత్తగా మొదలు పెట్టవలసింది విస్తరణ కాదు, వ్యవసాయం..."

మధ్యలో కల్పించుకున్న డైరెక్టర్ ఆదిశేషు "వాట్ డు యు మీన్?" అన్నాడు ఆసక్తిగా.

"యస్ సర్.. ఇప్పుడు మనం వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలి. మన ఫ్యాక్టరీకి కావలసిన పంటలు మన ఫ్యాక్టరీకి చుట్టుపక్కల మనమే పండించేలా చేయాలి. రైతులకు కావలసిన వసతులు కల్పిస్తే వారు చాలా బాగా నాణ్యమైన పంటలు పండిస్తారు. అప్పుడు అవి మన ఫ్యాక్టరీకి చాలా తొందరగా తక్కువ రవాణా ఖర్చులతో దొరుకుతాయి. ఇప్పుడు మనం చేసే ఈ పని దేశానికి ఉన్న 'అన్నపూర్ణ' అనే పేరును నిలిపేది సర్" అంటూ ముగించగానే హాలు మొత్తం చప్పట్లతో మారుమోగిపోయింది.

"గుడ్.. కీప్ ఇట్ అప్.. వెంటనే ప్రపోజల్స్ పంపించు" అంటూ వెళ్లబోయి, నాన్నా, మణి ఎలా ఉన్నాడు?" అన్నాడు.

"చాలా సంతోషంగా ఉన్నారు సర్" అంది శ్రావణి.

# మహాత్ములే మార్గదర్శకులు

డా॥ పులివర్తి కృష్ణమూర్తి



ఆ పరమాత్మను నమ్మిన వారికి ఆయనే సకలమూ. ఆయనే వారికి ప్రియతముడు. ఆ పరాత్పరుడే మనకు ప్రియసఖుడు. ఆయనే సర్వమూ, ఆయనే సకలమూను. ఆయనే కలిమి, బలిమి. ఆయనే ఆత్మబంధువు. ఆయనే రక్షకుడు. మన వెంట వుండి మనలను నడిపించేది ఆ స్వామియే. మనల్ని వెనుక వుండి కాపాడేది ఆయనే.

ఇలా భావించేవారిని ఆ సర్వేశ్వరుడే సదా ఆదుకుంటూ వుంటాడు. ఎందరో భక్త శిఖామణులు స్వామివారిని సేవిస్తూ ఆ అనుభూతులను ఆనందోత్సాహాలతో కీర్తిస్తూ సంకీర్తనలుగా గానం చేస్తూ తరించారు.

వేయి నామాలతో కీర్తించినా తనివి తీరదు. ఆయనను కీర్తించడంలో స్వామివారిని హరి అనీ, పుండరీకాక్ష, రఘురామా, గోవిందా, కరుణానిధీ, ధరణీధరా, నీరజనాభా, దామోదరా, మధుసూదనా, విఠలుడా, విష్ణుదేవుడా, పురుషోత్తమా, నారాయణా.. అంటూ ఆ ఏడు కొండల స్వామివారిని కీర్తిస్తూ పదకవితా పితామహుడు అన్నమాచార్యులవారు పదకవితలుగా మనకు అందించారు. ఆయన ప్రతి కీర్తనా భక్తి పారవశ్యంతో గానం చేసినవే. అంతా నీవే, నా చెంతన నీవే, నా కులమూ నీవే, నా కలిమీ నీవే, నా తలపును నీవే, నా నెలవును నీవే.. అంటూ శ్రీ వేంకటేశ్వర స్వామివారిని తనకు రక్షకుడిగా నెంచి ప్రార్థించాడు. ఆ స్వామియే తనకు సిరిసంపదలు. ప్రతి క్షణం భక్తుడి తలపులో, ఆలోచనలో ఆ పరంధాముడిని ప్రత్యక్షం చేసుకున్నవారు ధన్యులు. తన దేహమే ఆ పరమానందుడిది అయినప్పుడు ఇక భక్తుడి జీవనం కూడా ఆయనదే కదా! అన్నమాచార్యుడు తన శరీరం, తన బతుకూ అంతా ఆ స్వామిదే అన్నారు.

పుట్టుక ఆయన వలననే, చావు పుట్టుకల మధ్య నడిచే జీవితమూ ఆయనదే. తనకంటూ ఒకరు వున్నారన్న ధైర్యం వుంటే, వారికిక కుల మత భేదాలు వుండవు. అంతస్థుల తారతమ్యం ప్రసక్తే రాదు. పుణ్య పాపాల మాట అటుంచితే, షరతులు అవధులూ లేని ప్రేమ వారిది. వారి మాటలు జీవశక్తిని నింపుతాయి. వారి ప్రేమ ఈ ప్రపంచ పరిధులు దాటి, మానవతా బలహీనతలను అధిగమింపజేసి, అజ్ఞానమనే మురికిని తొలగించి, ఈ నవ నాగరిక ప్రపంచంలో కొట్టుమిట్టాడుతున్న ప్రజానీకానికి దారి చూపిన మహానుభావులు అన్నమయ్య, రామదాసు, తులసీదాసు, కబీరు వంటి గొప్ప భక్తులు. వారి సన్నిధీ, సాంగత్యం ఒక మహా వరంగా భావించాల్సి వుంది. ఇక రామకృష్ణ పరమహంస వంటి మహాత్ములు ఈ సమాజానికి భగవతత్వం అర్థమయ్యేలా చేసారు. భగవంతుని స్మరణయే నిజమైన సంపద అన్న విషయాన్ని మనకు స్పష్టమయ్యేలా చేశారు. మన కష్టాలూ, కోరికలూ భగవతుని వైపు చేర్చే సోపానాలుగా మనకు సహకరించేలా మహాత్ములైనవారు మనకు బోధించారు.

భగవంతునికి చేరువయ్యేకొద్దీ మనలోని అహంకారం నశిస్తుంది. అహంకారం నశించేకొద్దీ సహజంగానే సాటి మనిషిని ప్రేమించగలుగుతాం. సహన గుణం, క్షమాగుణం మనకు సహజంగానే అలవడుతాయని ఈ మహానుభావులందరూ మనకు తెలియజేశారు. వారి జీవిత విశేషాలను పరిశీలిస్తే జీవితంలో ప్రతి క్షణమూ ఒక సాధన, ఒక తపస్సు అని చెప్పకనే చెప్పినట్లవుతుంది. ప్రతి అనుభవం ద్వారా గుణపాఠం నేర్చుకొని ముందుకు సాగడమే జీవితం.

ప్రతికూల పరిస్థితులకు ఎదురీది, తీర్చిదిద్దుకొని, పరిపూర్ణతను సాధించడమే జీవితం. ఇంతటి మహోన్నతమైన విషయాలు మనకు ఎందరో భక్త శిఖామణులూ, మహాత్ముల ద్వారా తెల్సుకునే అవకాశం లభించడం మన అదృష్టం.


## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి.

రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80. sunmagvaartha@gmail.com

**1921 నవంబరు 12న నాటి నైజాం సంస్థాన పాలనా రోజులలో హైదరాబాద్‌లో మరాఠా సామాజిక సంస్కర్త మహర్షి ధోండోకేశవ్ కార్వే అధ్యక్షతన సభలో ప్రముఖ వక్తలందరూ మరాఠీ, ఉర్దూ, ఇంగ్లీష్ భాషలలో తీర్మానాలపై ప్రసంగించారు. తెలుగు ప్రముఖులు కూడా హాజరయిన ఆ సభలో నగరంలోని ప్రముఖ న్యాయవాది అలంపల్లి వేంకట రామారావు తెలుగులో ప్రసంగించటానికి ఉపక్రమించగానే సభికులు అరచి గోల చేసి ప్రసంగం కొనసాగనీయకుండా చేసారు.**

జయసూర్య

# నైజాం పాలనలో మాతృభాషకు సంకెళ్లు

ఆ సంఘటన మాతృభాష తెలుగుకు అవమానకరం కావడంతో అదే రోజు రాత్రి న్యాయవాది టేకుమాల రంగారావు ఇంట్లో మాడపాటి హనుమంతరావు, మిట్టా లక్ష్మీనరసయ్య, ఆదిరాజు వీరభద్రయ్య, నడింపల్లి జానకి రామయ్య, బూర్గుల రామక్రిష్ణారావు, మందుముల నరసింగరావు, బోయినపల్లి వేంకట రామారావు, కొమ్మువరపు సుబ్బారావు, బూర్గుల నరసింహారావు, డా॥ పందిటి రామస్వామి నాయుడు వంటి పెద్దలు సమావేశమై ఆంధ్రజన సంఘం స్థాపించారు. 1922 ఫిబ్రవరి 24న ఆంధ్రజన సంఘం సమావేశం కొండా వెంకట రంగారెడ్డి అధ్యక్షతన రెడ్డి విద్యాలయంలో నిర్వహించారు. నాటి హైదరాబాద్ స్టేట్ తెలంగాణ సీమలోని నిజాం రాష్ట్రంలో నీలగిరి, తెనుగు, గోలకొండ వంటి తొలి తెలుగు పత్రికలు, భాషా నిలయాల పేరిట గ్రంథాలయాలు, పుస్తక, గ్రంథాల ప్రచురణలు, ఆంధ్ర మహాసభలు తెలంగాణసీమలో తెలుగు భాషా, సంస్కృతీ పునరుజ్జీవానికి మాతృభాష తెలుగు పునర్వికాసానికి అంకితమయ్యాయి. 1920 దశకపునాటి తెలంగాణ సామాజిక రాజకీయ, ఆర్థిక, సారస్వత చరిత్రను నాటి పత్రికా, రచనా రంగం ప్రతిబింబింపచేసింది. 'నీలగిరి', తెలంగాణ తొలి వారపత్రికను నడిపిన వైతాళిక మహోదయుడు షబ్నవీస్ అనే మాటకు అర్థం, నిజాం కాలంలో 'నగదు నవీస్', 'షబ్నవీస్' వంటి ఉద్యోగులు ఉండేవారు. 'నగదు నవీస్' నేటి క్యాషియర్ వంటివాడు.

'షబ్నవీస్' అంటే రాత్రి సమయంలో వ్రాయసకాడు. సంస్థానం కార్యాలయంలో ఎక్కువ పని వున్నప్పుడు కొందరు ఉద్యోగులు రాత్రి సమయంలో రాసేవారిగా ఉండేవారు. అట్టి వ్రాయసకాంఢ్ర వంశమే షబ్నవీసు. నీలగిరి పత్రికా సాహసిక వైతాళికుడు వెంకట రామనరసింహారావు ఇంటి పేరుగా, వంశ నామమైంది. 1948 వరకు అసఫ్‌జాహీల పాలన సాగిన నిజాం రాజ్యంలో పార్శీ రాజ భాష అనంతరం, 1884 నుంచి ఉర్దూ రాజభాషగా కొనసాగింది. తెలుగు చదవడం, రాయడం నేర్చుకొనే ప్రజా చైతన్యం గ్రంథాలయోద్యమంగా క్రమేపీ, తెలుగు భాషా ప్రచారం, నాటి కొమర్రాజు వంటి పెద్దల లక్ష్యమైంది. ఉస్మాన్ ఆలీఖాన్ (1911-1948) ఏడవ నిజామ్‌గా నిజాం రాష్ట్రంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం అవతరించే రోజులలో కూడా విశ్వవిద్యాలయంలో రాజభాష ఉర్దూ మాధ్యమంగా ఉండేది.




అసఫ్ జాహీల పాలనలో గద్వాల, వనపర్తి సంస్థానాలు తెలుగు సాహిత్యానికి కవిపండితులకు ఆదరణ కల్పించారు. ఆంధ్ర ప్రాంతం నుంచి ప్రసిద్ధ కవిపండితులు సన్మానాలు అందుకొనేవారు. నాటి తెలంగాణ కవిపండితులు కూడా ఎంతో ప్రతిభావంతంగా భాషాభివృద్ధి ద్వారా విద్యా విజ్ఞానోద్యమంతో తెలంగాణసీమలో జాగృతి, చైతన్యం కలిగించారు. కుమార సంభవం రచించిన నన్నెచోడకవిని నన్నయకు పూర్వ ప్రాచీన మహాకవిగా మానవల్లి రామకృష్ణకవి ప్రతిపాదించారు. నన్నయ్యే ఆదికవిగా వాదించే పిడివాదం, తల ఎత్తినా నిజాం ప్రభుత్వం తెలుగుపై ఎన్నో ఆంక్షలు, అడ్డంకులు, అణచివేతలు విధించినా, తెలంగాణ సంస్కర్తలు, సాహితీవేత్తలు సాహిత్యం ఆయుధంగా రాజకీయ శక్తిగా నిజాం వ్యతిరేకోద్యమాలతో, విముక్తి పోరాటాలు నడిపించారు.

నిజాం పాలనలో తెలుగు భాషాదీపం కొడిగట్టిన ఆ కాలంలో మాతృభాషా పునరుద్ధిపానికి సురవరం, మాడపాటి, కాళోజీ, బూర్గుల, లోకనంది, గడియారం, దేవులపల్లి వంటి తొలి అగ్రేసర సాహితీమూర్తులు, అవిశ్రాంతంగా శ్రమించారు. అతికొద్దిమంది భాష అయినా ఉర్దూకు పట్టం కట్టిన నిజాం, ప్రాథమిక తరగతి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు ఉర్దూను బోధనా భాషగా, ప్రభుత్వ భాషగా చేయటమే కాక తెలుగు వీధి పాఠశాలలకు కూడా అనుమతుల ఆంక్షలు విధించాడు. గ్రంథాలయాలు కూడా అనుమతించని రోజులవి. ఆంధ్ర అంటే నిజాంకు అయిష్టం కావడంతో తొలినాట ఆంధ్రమాత పత్రికకు అనుమతి నిరాకరించడంతో, నాటి హైదరాబాద్ నుంచి వెలువడిన పత్రికల్లో ఆంధ్ర లేకుండా అయింది. నైజాం కాలంలో మన మాతృభాషకు పట్టిన శని అంతా యింతా కాదు.

"మన యాసల్నే మన బతుకున్నది. ఆ యాసలున్న పలుకుబళ్లల్నే తెలంగాణ జీవితం ఉన్నది. కమస్కం నీ భాషల్నన్న నువ్వు రాసే ధైర్యం జేయి.." ప్రజాకవి కాళోజీ జీవన సాహితీ ప్రస్థానంలో అన్న మాటలు అక్షర సత్యాలై తెలంగాణ సీమలో మాతృభాష దశాబ్దాల పోరాట వికాస చరిత్రకు మార్గదర్శకమైంది.

# ప్రేమ లేఖ

యామిజాల జగదీశ్

ప్రేమ గుప్పెట్లో ఉన్న ప్రేమికులకు ప్రేమతో రాస్తున్న ఉత్తరమిది.

నేను మీకు తెలుసు.. కానీ నన్ను మీరు గ్రహిస్తున్నారా?

ఏమిటీ చచ్చు ప్రశ్న? అని అనుకుంటున్నారు కదూ. గ్రహించామని మీరు చెప్పినా మీలో పలువురు గ్రహించలేదన్న మాటే నిజం.

ఓ విషయాన్ని తెలుసనడం వేరు.. గ్రహించడం వేరు.

విద్యుత్తు మన శరీరాన్ని తాకితే ఏం చేస్తుంది? అని అది అందరికీ అనుభవంలోకి వచ్చి ఉంటుందా? అంటే లేదనే చెప్పవచ్చు.

దేవుడి మీద నమ్మకం ఉన్న వారందరికీ దేవుడిని చూసి ఉంటారా? అంటే లేదనే చెప్పవచ్చు. ఎక్కడో కొందరికి మాత్రమే అటువంటి అదృష్టం కలిగి ఉంటుంది కదా. సాగే ఆ ప్రేమను నా విషయం మీకు తెలిసినప్పటికీ గ్రహించి ఉంటారని నేననుకోను. నా మీద నమ్మకం ఉన్నప్పటికీ నన్ను పరిపూర్ణంగా గ్రహించారని చెప్పలేను.


పరిశ్రమ మీద, చదువు మీద, కార్యాలయం మీద, క్రీడల మీద, సాహిత్యం మీద, తినడం మీద ఇలా.. ఎన్నింటిపైనో ఆసక్తి ఉండొచ్చు. అలాగే నా మీదా మీకు ఆసక్తి ఉండవచ్చు. కానీ గ్రహించేవారి సంఖ్య తక్కువగానే ఉంటుంది. అభిమానంతోనో లేదా జీవనం సాగించడానికో చేసే పని మీద ప్రేమ పుడుతుంది. అలాగే చెప్తారు కూడా. కొందరు బాధ్యతను ప్రేమిస్తున్నానని చెప్తారు.

తోటి మనిషి మీద ప్రాణి మీద ప్రేమ ఉండటం అనేది మనం చూస్తూనే ఉంటాం. అయితే ఆ ప్రేమను ఒక్కొక్కరు ఒక్కో విధంగా ప్రేమిస్తారు. ఇష్టపడతారు. ఇష్టం లేని వాటి మీద ప్రేమ చూపమంటే చూపలేరు. ప్రేమ మీద ప్రేమంటూ ఉంటేనే ప్రేమించగలరు. లేదంటే ఎన్ని చెప్పినా ఎంత చెప్పినా ప్రేమ పుట్టదు. బలవంతంగా ప్రేమించడం అనేది కుదరదు.

అందుకే మళ్లీ అడుగుతున్నాను.

మీరు తారాస్థాయిలో ప్రేమిస్తున్నారా? అని, గ్రహించారా? అని. మీ హృదయ లోతుల్లో నేను ఉన్నానా అని. ఎవరికి వారు సమీక్షించుకుంటే నిజమైన ప్రేమ ఏంటో తెలిసొస్తుంది.

కొందరు ప్రేమిస్తున్నామని చెప్తూ ఏదో అవసరాల కోసం ఒకరి మీద అభిమానం చూపుతారు. ప్రేమిస్తున్నట్టుగా నటిస్తారు. అది ఎక్కువ కాలం సాగదు. మధ్యలోనే తెగిపోతుంది. ఈ భూమికి సృష్టి చేస్తే ప్రాయంలో మార్పు. అతివృష్టి, అనావృష్టి. మంచువాన కురవటం, ఎండ ఎక్కువగా ఉండటం.. ఇలా పలు రకాలుగా అన్నీ అతిగా ఉండటం వల్ల లేనిపోని



సమస్యలు ఎదురవుతుంటాయి. అలాగే నా విషయంలో మీరు హెచ్చుతగ్గులు గ్రహించగలరా?

పెరుగుతున్న వివాదాలు, ఉన్నట్టుండి తొందరపడి ప్రేమించుకున్నామని ఏదో ఆవేశంతో పెళ్లి చేసుకోవడం, అయితే కొన్ని రోజులకే అభిప్రాయ భేదాలతో వాదించుకోవడం, ఘర్షణ పడటం, విడిపోవడం.. ఇటువంటి మనుషుల వైఖరితో నాకు చెడ్డపేరు తీసుకొస్తుంటారు. కళంకాన్ని ఆపాదిస్తారు. ప్రేమ మీద మరక పడుతుంది. అది నాకవసరమా? నిజానికి నేనేమీ చెయ్యలేదు. మనుషులు కొందరి తొందరపాటు వల్ల చెడ్డ పేరు వస్తుంది. మీరు దానిని ప్రేమ అని చెప్పినా నేను దానిని నిజమైన ప్రేమ అనను. అది వయస్సుతో వచ్చిన వొట్టి ఆకర్షణ తప్ప అందులో ప్రేమభావం ఉండదని కచ్చితంగా చెప్పగలను.

స్త్రీ-పురుషుల మధ్య ఉన్న స్నేహంలో గీత దాటని సంస్కృతి ముఖ్యం. స్నేహానికి చెడ్డ పేరు రాని విధంగా ప్రవర్తించాలి. హద్దుల్లో ఉన్నప్పుడు స్నేహానికి కళంకం రాదు. ప్రేమకూ రాదు.

స్టార్ హోటల్లో రాత్రుళ్లు రకరకాల నృత్యాలు చేస్తూ ఆడా మగా అనే తేడా లేకుండా ప్రవర్తించే తీరుని కొందరు ప్రేమ అనుకుంటున్నారు. అది సరి కాదు.

నిజానికి ప్రేమ ఆశించదు. అదే అసలైన ప్రేమ. మిగతావన్నీ నిజమైన ప్రేమ కాదు.. కాబోదు. నిష్కల్మషమైన ప్రేమ బహు అరుదు. అది ఏదీ ఆశించదు. ఇంకొకటి చెప్పనా!

ప్రేమ నిస్వార్థమైనదైతేనే పవిత్రంగా ఉంటుంది. ఏదైనా ఆశించడం అంటూ మొదలుపెడితే అక్కడ ప్రేమ ఉండదు. అన్నీ అవసరాలతో ముడిపడి ఉంటుంది. అవసరాలు తీరగానే ప్రేమా లేదు, దోమా లేదు అన్నట్టు ఎవరోలా ప్రవర్తిస్తారు. స్నేహంలో ఎందుకో బాయ్ ఫ్రెండ్ అని గర్ల్ ఫ్రెండ్ అని ముద్దెర వేసి ప్రేమకు కళంకం తీసుకొస్తారు. అది మంచిది కాదు.

ఆధునిక సమాజంలో కామ సహచరుడు, కామ సహచరి పద బంధాలకు ప్రేమ అని ముద్దెర వెసి తక్కువ చేయకండి, అది నాకిష్టం లేదు.

వాట్సప్‌లోనో లేక మరో సామాజిక మాధ్యమంలోనో ఐ లవ్ యు అనే మాటలను యథేచ్ఛగా వాడేస్తుంటారు. మొహాలు కూడా చూసుకోనుండరు కానీ నేను నిన్ను ప్రేమిస్తున్నాను.. నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా? అని అడగటం సర్వసాధరణంగా జరిగిపోతుంటుంది. అది చూస్తుంటే నాకు అసహ్యం వేస్తుంది. ప్రేమ అనే మాటను ఏదో అవసరం కోసం చెప్పడం సరికాదు. అది ప్రేమవదు. ప్రేమ అనేది హృదయ లోతుల్లోంచి రావాలి. అంతేతప్ప పైపై మాటల్లో అది పుట్టదు. పుట్టినా అది ఎక్కువ కాలం ఉండదు. ఎంత తొందరగా చెప్పుకుంటారో అంతే తొందరగా అది అంతరించిపోతుంది. అటువంటప్పుడు అది ప్రేమెలా అవుతుంది. మీరే ఆలోచించండి..

(మిగతా 26వ పేజీలో..)

# బ్రెజిల్‌లో అద్భుత విగ్రహాలు

**షేక్ అబ్దుల్ హాకీం జాని**

దక్షిణ అమెరికా ఖండంలోని దేశాలలో అతి పెద్ద దేశం బ్రెజిల్. దీని రాజధాని పేరు బ్రెజిలియా. వైశాల్యం రీత్యా ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద దేశమైన బ్రెజిల్ దక్షిణ అమెరికా భూభాగంలో దాదాపు సగం విస్తీర్ణాన్ని కలిగి ఉంటుంది. జనాభా లెక్కల రీత్యా కూడా ప్రపంచంలోనే ఆరవ అతిపెద్ద దేశమైన బ్రెజిల్ నాల్గవ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఉంది.

దక్షిణ అమెరికా ఖండంలోని దేశాలలో అతి పెద్ద దేశం బ్రెజిల్. దీని రాజధాని పేరు బ్రెజిలియా. వైశాల్యం రీత్యా ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద దేశమైన బ్రెజిల్ దక్షిణ అమెరికా భూభాగంలో దాదాపు సగం విస్తీర్ణాన్ని కలిగి ఉంటుంది. జనాభా లెక్కల రీత్యా కూడా ప్రపంచంలోనే ఆరవ అతిపెద్ద దేశమైన బ్రెజిల్ నాల్గవ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఉంది.



## రియో డి జనీరో


బ్రెజిల్ అధికార నామం 'ఫెడరేటివ్ రిపబ్లిక్ ఆఫ్ బ్రెజిల్'. బ్రెజిల్‌లో రెండవ అత్యధిక జనాభా కలిగిన నగరం పేరు రియో డి జనీరో. ఉత్తర దక్షిణ అమెరికా ఖండాల్లో ఆరవ పెద్ద నగరం. రియో 2016 ఒలింపిక్ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చింది. 2016 వేసవి పారా ఒలింపిక్‌లకూ ఆతిథ్యం ఇచ్చింది. 2012 జులై 1న ఈ నగరంలో కొంత భాగాన్ని ప్రపంచ సాంస్కృతిక వారసత్వ ప్రదేశంగా యునెస్కోవారు గుర్తించారు. కోర్కోవాడో పర్వతం మీద నెలకొల్పిన 'క్రైస్ట్ ది రిడీమర్'గా పిలుచుకునే ఏసుక్రీస్తు విగ్రహం రియోలోని అత్యంత ప్రముఖమైన ప్రదేశాల్లో ఒకటి. ఇది ప్రపంచంలోని ఏడు నవీన వింతల్లో ఒకటిగా విరాజిల్లుతోంది. 1920 నుండి 1931 మధ్య కాలంలో దీని నిర్మాణం జరిగింది. 2014లో పడిన పిడుగు వల్ల ఈ విగ్రహం బొటన వేలు దెబ్బతింది. ప్రపంచంలోని అతిపెద్ద, ప్రముఖ విగ్రహాల్లో ఒకటైన బ్రెజిల్‌లోని ఏసుక్రీస్తు విగ్రహం పలు సందర్భాల్లో పిడుగుపాటుకు గురైంది. క్రీస్ట్ ది రిడీమర్‌గా పిలిచే ఈ విగ్రహం తల భాగంలో పిడుగుపాటు సంభవించింది. జీసస్ విగ్రహం తలను మెరుపు తాకుతున్న ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

ఆ మెరుపు విగ్రహంపై తగిలినప్పుడు దేవుడు ఏదో అతీంద్రియ శక్తిని ప్రదర్శిస్తున్నట్లుగా ఒక అభిప్రాయాన్ని కలిగించేలా అది కనిపిస్తోంది. ఫెర్నాండో బ్రాగా అనే వ్యక్తి ఈ ఫొటోలను తీసి తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. ఎత్తయిన ప్రదేశంలో పిడుగు పడటం సహజమే కానీ సరిగ్గా ఆ సమయంలో ఫొటో తీయడం అనేది అద్భుతమని నెటిజన్లు అతడి నైపుణ్యాన్ని ప్రశంసిస్తున్నారు. ప్రపంచంలో ఎత్తయిన క్రీస్తు విగ్రహాల్లో ఇది నాలుగో స్థానంలో ఉంది. 98 అడుగుల ఎత్తయిన ఈ విగ్రహం 26 అడుగుల ఎత్తయిన పీఠంపై ఉంది. చేతులు చాచినట్లుగా ఉన్న ఈ విగ్రహం చేతుల వెడల్పు 28 మీటర్లు ఉంటుంది. ఏటా దాదాపు 20 లక్షల మంది ఈ విగ్రహాన్ని సందర్శిస్తుంటారు. ఈ నగరాన్ని పోర్చుగీసువారు 1565లో స్థాపించారు. 1763లో పోర్చుగీసువారి పాలనలోనే బ్రెజిల్ దేశానికి రాజధాని అయింది. 1808లో యావత్తు పోర్చుగీసు సామ్రాజ్యానికి ఇది రాజధాని అయింది.

1822లో స్వాతంత్ర్య యుద్ధం మొదలయ్యే వరకూ ఇది పోర్చుగీసు సామ్రాజ్యానికి రాజధానిగా ఉంది. ఒక వలస సామ్రాజ్యపు రాజధానిగానే కాక దాని వలస దేశాల్లోని ఒక నగరంగా ఉండడం చరిత్రలో చాలా అరుదు. ఆ తరువాత రియో 1889 వరకు బ్రెజిల్ స్వతంత్ర సామ్రాజ్యానికి రాజధానిగాను, ఆ తరువాత 1960 వరకూ బ్రెజిల్ రిపబ్లిక్‌కు రాజధానిగానూ ఉంది. నేడు బ్రెజిలియా బ్రెజిల్‌కు రాజధాని అయింది.



## బ్రెజిల్‌లో మరో కొత్త ఏసుక్రీస్తు విగ్రహం



దక్షిణ బ్రెజిల్‌లో ఏర్పాటు చేసిన ఏసుక్రీస్తు కొత్త విగ్రహం రియోలో దానికంటే ఎత్తయినది. సర్వసాధారణంగా ఒక దేశంలో ఎత్తయిన విగ్రహం పెడితే దానికంటే పెద్ద విగ్రహాన్ని మరో దేశం ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తుంది. బ్రెజిల్ మాత్రం అందుకు భిన్నంగా తన దేశంలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఎత్తయిన ఏసుక్రీస్తు విగ్రహం 'క్రైస్ట్ ది రిడీమెర్' రియోలో ఉండగా అంతకంటే ఎత్తయిన మరో ఏసుక్రీస్తు విగ్రహం దక్షిణ బ్రెజిల్‌లోని సియారా స్టేట్‌లోని ఎన్‌కాంటాడో అనే చిన్న పట్టణంలో ఏర్పాటు చేశారు. రియోలోని 'క్రైస్ట్ ది రిడీమెర్' పీఠం కలుపుకుని 124 అడుగుల ఎత్తు ఉంటే దక్షిణ బ్రెజిల్‌లోని ఏసుక్రీస్తు విగ్రహం 141 అడుగుల ఎత్తులో నిర్మించారు. ఈ విగ్రహాన్ని క్రీస్తు రక్షకుడు అని పిలుస్తున్నారు. శిల్పి మార్కోస్ మారా దీన్ని చెక్కారు. స్థానిక వ్యాపారులు విరాళాలు పోగు చేసి ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. 2019లో నిర్మాణం మొదలైంది. 2022 ఏప్రిల్ 22న పూర్తి చేశారు. "ప్రపంచంలో అతి పెద్ద ఏసుక్రీస్తు విగ్రహం ఇదే" అని ఈ విగ్రహానికి నిధులిచ్చిన అసోసియేషన్‌కి ఉపాధ్యక్షుడైన రాబిన్సన్ గొంజాల్టీ అప్పట్లో ప్రకటించారు. బలమైన లోహ నిర్మాణంపై కాంక్రీట్‌తో ఈ విగ్రహాన్ని నిర్మించారు. ఓ కొండపై దీన్ని ఉంచారు. ఆ కొండ ఎక్కిన వారికి ఎన్‌కాంటాడో పట్టణం కనిపిస్తుంది. ఈ విగ్రహం నిర్మాణ దశలో ఉండగా 21 దేశాలకు చెందిన 50 వేల మందికి పైగా తిలకించారు. దీన్ని ఏర్పాటు చెయ్యాలన్నది అప్పటి స్థానిక మాజీ మేయర్ అడ్రోఆల్డో కొంజాల్టీ ఆలోచన. ఆయన 2021 మార్చిలో కరోనా వల్ల చనిపోయారు. ఇలా ప్రత్యేక సంకల్పంతో బ్రెజిల్‌లో అతి పెద్ద క్రీస్తు విగ్రహం ఏర్పాటై ప్రపంచ పర్యాటకుల్ని ఆకట్టుకుంటోంది. ఈ విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయకపోయినప్పటికీ ఇది ప్రపంచ ప్రసిద్ధి అయ్యేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎందుకంటే ఈ విగ్రహం ఛాతీపై హృదయ ఆకారంలో భారీ కిటికీ ఉంది. పర్యాటకులు అక్కడి నుంచి నగర అందాలను తిలకించవచ్చు. అయితే ప్రారంభంలో ఇందులో నుండి చూడటానికి పర్యాటకులకు అనుమతి లేదు. 2023 నుంచి దీన్ని చూసేందుకు ప్రజలను అనుమతించాలని నిర్ణయించారు.

ఈ విగ్రహం ఉన్న ప్రాంతంలో భారీ టూరిస్ట్ కాంప్లెక్స్ నిర్మించాలన్న ప్రణాళికను సిద్ధం చేశారు. త్వరలోనే దాన్ని నిర్మించి ప్రపంచ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

**(24వ పేజీ తరువాయి..)**

## (ప్రేమ లేఖ)

నేను నిన్ను ప్రేమిస్తున్నాను అని చెప్పడమో దానిని ఇతరులు స్వీకరించడమో ఆ తర్వాత పలు చోట్లకు కలిసి తిరగడం, గంటలకొద్దీ మాట్లాడుకోవడం, ఫోన్లో మాట్లాడటం, అవకాశం దొరికినా లేదా అవకాశాన్ని కల్పించుకుని అవసరాలు తీర్చుకోవడం కోసం ఐ లవ్ యు అనడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు. అది ప్రేమే కాదు. దేహం అనేది నిజమైనది. మౌలికమైనది. మరణం వరకూ మనతో ఉండేది. అలా మరణం వరకూ మారకుండా ఉండే అనుభూతే నేను.

మాతృత్వానికి నికరమైన ప్రేమానుభూతిని నేను. తన బిడ్డ మీద తుది శ్వాస వరకూ చెక్కుచెదరని ప్రేమ చూపుతుంది తల్లి. అదీ నిజమైన ప్రేమ అంటే. అంతేతప్ప ఆకర్షణతో వచ్చేది ప్రేమ అవదు.

తన పిల్లలు ఎలాంటి వారైనా తల్లిప్రేమకు సాటి తల్లి ప్రేమే తప్ప మరొకటి కాదు. ఆ తల్లి తర్వాతి స్థానంలో ఓ మగాడికి ఏర్పడే బంధం భార్యే. ఆ భార్య పాశంలో నేనుంటాను.

సహనం, భరించడం వంటివన్నీ నాలో ఎక్కువ ఉండాలి. లేకుంటే ఆ ప్రేమబంధం ఎల్లకాలం మనుగడ సాగించలేదు.

నన్ను స్పృశించకండి.. అని నేను హెచ్చరించడానికి నేనేమీ విద్యుత్తుని కాను. కొత్తగా రంగులు పూసిన గోడనో కాను. నాలోని అనుభూతి సున్నితమైనది. మృదువైనది. దాన్ని ఎంతో జాగ్రత్తగా అనుసరించాలి. ఒత్తిళ్లు, బలవంతాలు పని చేయవు. నన్ను పరిపూర్ణంగా అర్థం చేసుకుని హృదయ పూర్వకంగా హత్తుకుంటేనే మీరు నన్ను గ్రహించినట్లవుతుంది. అంతేతప్ప పైపై పూతలా నడిపిస్తానంటే నేను అక్కడ ఉండను.

మీ మధ్య అభిప్రాయ భేదాలతో నన్ను అపవిత్రం చేయకండి. నేను పవిత్రమైనదానిని. దానిని అలాగే ఉండనివ్వండి. లేనిపోని మాటలతో, అవసరాలతో నన్ను కలుషితం చేయకండి. మరక అంటనివ్వకండి. అప్పుడే నేను మీకు అర్థమవుతాను. నన్ను ఆరాధించి మీరు సుఖపడితే నాకు ఆనందం.

సింగిల్ పేజీ కథ

# గివ్ అండ్ గిఫ్ట్

దొండపాటి కృష్ణ

"రండి మాస్టారు.. చాలా సేపట్నుంచి ఎదురు చూస్తున్నారట. చెప్పండి, ఫండింగ్ ఏమన్నా కావాలా?" అప్పుడే మీటింగ్ రూమ్ నుంచి వచ్చిన ఎం.డి.గోవర్ధనరావు అడిగాడు.

"ఫండింగ్ గురించి రాలేదు సార్.. పిల్లల్ని ఎప్పుడూ పుస్తకాల్లోనే కాకుండా గేమ్స్‌లో కూడా ఎంకరేజ్ చేద్దామని మన స్కూల్లో గేమ్స్ కండక్ట్ చేశాం. మెరికల్లాంటి కొంతమంది పిల్లల్ని ఎంపిక చేశాం, చిన్న ఫంక్షన్ కూడా పెడుతున్నాం. మీరే చీఫ్ గెస్ట్‌గా రావాలి సార్" ఆహ్వానించాడు హెడ్ మాస్టర్ వేణుగోపాల్.

"దానికి గొప్పవాళ్లు చాలా మంది ఉన్నారు కదండీ" అన్నాడు గోవర్ధనరావు.

"ఈ ఫంక్షన్‌కి మీరైతేనే కరెక్ట్ సార్. చిన్న వయసులోనే స్పింటెక్స్ ఫ్యాక్టరీ పెట్టి అనతి కాలంలోనే దాన్నింతగా వృద్ధిలోకి తీసుకొచ్చిన మీరంటే అందరికీ గౌరవమే! మీ మాటకు విలువిస్తారు. ఆరోజు మీరు చెప్పే 'నాలుగు వాక్యాలు' స్టూడెంట్‌కి ఇన్స్పిరేషన్‌గా ఉంటాయి సార్. కాదనకండి" అంటూ వేణుగోపాల్ పట్టుబట్టడంతో గోవర్ధనరావు ఒప్పుకున్నాడు.

ఆరోజే బహుమతి ప్రదానోత్సవం కార్యక్రమం. వేదిక మీదున్న గోవర్ధనరావుగారి గొప్పదనాన్ని, నిబద్ధతను, క్రమశిక్షణను కొనియాడుతూ విద్యార్థులకు వివరించారు ఉపాధ్యాయులు. ఆయనకు లాగానే ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆట, పాటల్లో గెలుపొందిన విద్యార్థులకు గోవర్ధనరావు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. అనంతరం ఆయన్ని మాట్లాడమని కోరారు.

"వీళ్లందరూ అన్నట్లు నేను గొప్పవాడినే అయితే ఆ క్రెడిట్ అంతా నాకు పాఠాలు బోధించిన మా మాస్టార్లదే! అందుకే నాకు టీచర్స్ అంటే రెస్పెక్ట్. స్టూడెంట్స్ అంటే ప్రేమ. ఆ ప్రేమకొద్దీ ఇక్కడున్న రెండొందల మంది విద్యార్థుల్లో ఆలోచన రేకెత్తించడానికి మీకు ఉపయోగపడే పనొకటి చేయాలనుకుంటున్నాను. ఇక్కడున్న స్టూడెంట్స్ అందరికీ తలో రెండు వేల రూపాయలు ఇవ్వాలనుకుంటున్నాను..." అనగానే సంతోషంగా ప్రాంగణమంతా కరతాళ ధ్వనులతో దద్దరిల్లిపోయింది.

గోవర్ధనరావు సైగ చేయడంతో పెద్ద కార్టన్ బాక్స్ తీసుకొచ్చి టేబుల్ మీద పెట్టాడు పీఏ. ఇంతలో హాజరు పట్టీ తెప్పించారు హెడ్ మాస్టర్. ఆరు నుంచి పదవ తరగతి వరకు వరుసగా పిలిచి ఒక్కొక్కరికీ రెండు కవర్లు ఇచ్చాడు గోవర్ధనరావు. ఒక కవరు మీద 'గిఫ్ట్' అనీ, మరో కవరు మీద 'గివ్' అని రాసి ఉంది. అలా ఎందుకు రాసి ఉందో స్టూడెంట్స్‌కి అర్థం కాలేదు. మర్మమేమిటో తెలుసుకోవాలని రెండు కవర్లనూ ఓపెన్ చేశారు. ఒక్కో కవర్లో వెయ్యి రూపాయలుండటంతో ఏనుగు ఎక్కినంత సంబరపడ్డారు. అయితే 'గిఫ్ట్', 'గివ్' అని ఎందుకు రాసారో మాత్రం



బోధపడలేదు.

ఉపాధ్యాయులు కూడా తమ బుర్రలకు పదును పెట్టసాగారు.

వాళ్ల ముఖకవళికలు చూసిన గోవర్ధనరావు "ఒక కవర్ మీద 'గిఫ్ట్' అని రాసి ఉంది. అందులో ఉన్న డబ్బులు మీవే! వాటిని ఖర్చు పెట్టుకోవాలంటే ఒక కండిషన్. అదేంటంటే– ఇంకో కవర్ మీద 'గివ్' అని రాసి ఉంది. అందులో ఉన్న డబ్బుల్ని మీరు వేరేవాళ్లకు 'గిఫ్ట్'గా ఇవ్వాలి. మీలో ఎవరైతే రెండో కవర్లో ఉన్న డబ్బుల్ని గిఫ్ట్‌గా ఇస్తారో వాళ్లే మొదటి కవర్లో ఉన్న డబ్బుల్ని తీసుకోవడానికి అర్హులు" వివరించసాగాడు. అతను చెప్పేది అర్థంగాక స్టూడెంట్స్ అయోమయంగా చూడసాగారు.

"మీరు అవసరంలో ఉన్నవారిని ఆదుకోవాలి. ఎవరికైతే ఆ డబ్బుల్ని గిఫ్ట్‌గా ఇచ్చారో, వాళ్లకే ఎందుకిచ్చారు? వాళ్లతో మీకున్న సంబంధమేమిటో స్పష్టంగా ఓ పేపర్ మీద రాయాలి. ఇందుకు మీకు నెల రోజులు గడువిస్తున్నాను. ఆ నెల రోజుల తర్వాత ఆ పేపర్లన్నీ నాకివ్వాలి. వాటన్నింటినీ నేను చూస్తాను. అప్పుడు మీరు వాటిని ఎలాగైనా ఖర్చు పెట్టుకోవచ్చు. అప్పటివరకు ఖర్చు పెట్టకూడదు. ఎవరైతే గిఫ్ట్‌గా ఇవ్వలేదో మొదటి కవర్లో ఉన్న డబ్బులు నాకు తిరిగి ఇచ్చెయ్యాలి.. అర్థమైందా?" ముగించారు గోవర్ధనారు.

ఒక్కోరోజు గడుస్తోంది. విద్యార్థుల్లో అయోమయం పోవడం లేదు. ఒకరోజు అన్ని తరగతుల్లోకి హెడ్ మాస్టర్ వేణుగోపాల్ వెళ్లి, గోవర్ధనరావు పెట్టిన కండిషన్ వెనకున్న రహస్యాన్ని వివరించాడు. రెండో కవర్లో ఉన్న డబ్బుల్ని ఏ విధంగా ఉపయోగించుకోవచ్చో తెలియజేశాడు.

నెల రోజులు గడిచాయి.

ఓ సాయంత్రం పూట గోవర్ధనరావును కలవడానికి రావూస్ స్పింటెక్స్ ఫ్యాక్టరీకి వెళ్లాడు వేణుగోపాల్.

"మొదట్లో వెయ్యి రూపాయలు వస్తాయి ఆశపడ్డా, తర్వాత దానం చేయడం వలన లభించే తృప్తిని స్టూడెంట్స్ రుచి చూశారు సార్. అందుకే మిగిలిన ఆ వెయ్యి రూపాయల్ని వాడుకోకుండా స్కూల్‌ని డెవలప్ చేయమని ఇచ్చేశారు" అంటూ తనతో పాటు తెచ్చిన రెండొందల పేపర్స్‌ను గోవర్ధనరావు టేబుల్ మీద పెట్టాడు వేణుగోపాల్.

గుడి అభివృద్ధికి కొంత, గ్రంథాలయాలకు కొంత, స్కూల్లో టాయిలెట్స్ క్లీనింగ్ కోసం కొంత, అన్నదానాలకు కొంత, వివిధ మార్గాల్లో ఎవరెవరు ఎలా డబ్బుల్ని ఉపయోగించారో చదివాడు గోవర్ధనరావు. వాటికన్నా స్కూల్ అభివృద్ధి కోసం పిల్లలంతా స్వచ్ఛందంగా ముందుకు రావడం మరింత సంతోషాన్ని కలిగించింది.

"ఏదైనా మార్పు రావాలంటే మాటల్లో కాదు సార్.... ఇలా చేతల్లో చూపించాలి. అప్పుడే పిల్లల్లో బలంగా నాటుకుంటుంది" పేపర్స్‌ను ప్రేమగా స్పృశించాడు గోవర్ధనరావు.



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



అనుకూలంగా ఉంటుంది. ప్రయాణాలు, బంధుమిత్రుల వంటి అంశాలు సంతోషం కలిగిస్తాయి. వృత్తి, ఉద్యోగాల్లో చెప్పుకోదగిన ఒడుదుడుకులేవీ ఏర్పడవు. వ్యాపారస్తులకు అనుకూలం. జీవిత భాగస్వామితో స్వల్ప విభేదాలకు అవకాశం. మీ ఆలోచనా విధానంలో మంచి మార్పులు చోటు చేసుకుంటాయి. నూతన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు.

## వృషభం



ప్రయత్నం మీద శుభ కార్యాలను సానుకూలపరచు కుంటారు. వ్యాపారస్తులకు కృషికి తగిన ఫలితాలు లభిస్తాయి. ఉద్యోగులకు ఉన్నత స్థానం లభిస్తుంది. ఆదాయాన్ని మించిన ఖర్చులున్నప్పటికీ సర్దుబాటు చేసుకుంటారు. గోప్యంగా వ్యవహరిస్తారు. దురుసుగా మాట్లాడే తత్వానికి స్వస్తి పలుకుతారు. నూతన గృహం కొనుగోలు చేస్తారు.

## మిథునం



మిశ్రమ ఫలితాలు గోచరిస్తున్నాయి. క్రమశిక్షణ లోపించకుండా జాగ్రత్తలు పాటించండి. అవసరాలకు తగినంత ధనం సమకూర్చుకుంటారు. అనవసరమైన భేషజాలకు వెళ్లరు. విందు-వినోదాల్లో ఆశ్చర్యకరమైన విషయాలు తెలుసుకుంటారు. మీతో ఏకీభవించేవారి సంఖ్య తక్కువగా ఉందని భావిస్తారు. మానసిక ప్రశాంతతను, సంతృప్తిని కలిగి వుంటారు.

## కర్కాటం



మిశ్రమ ఫలితాలు గోచరిస్తున్నాయి. ఆదాయ, వ్యయాలు సరిసమానంగా ఉంటాయి. వృత్తి, ఉద్యోగాల్లో యథాతథంగా ఉంటుంది. చిన్న చిన్న సమస్యలు ఎదురైనప్పటికీ ఇతరుల సహకారంతో కార్యక్రమం విజయపథంలో నడిపిస్తారు. మానసిక ప్రశాంతత కొరవడుతుంది. నిందలు ప్రచారంలో ఉంటాయి. కొత్త బాంధవ్యాలు ఏర్పడతాయి.

## సింహం



అనుకూల ఫలితాలు ఎక్కువగా పొందుతారు. నూతన ఉద్యోగం లభించే సూచనలున్నాయి. మీ ఆలోచనలు కార్య రూపం దాలుస్తాయి. దూర ప్రాంత ప్రయాణాల వల్ల అలసటకు లోనవుతారు. ఇతరుల విషయంలో పెద్దరికం వహించి పంచాయితీలను నిర్వహిస్తారు. సంతాన పురోభివృద్ధి బాగుంటుంది. అనుభవజ్ఞుల సలహాలు పాటిస్తారు.

## కన్య



అనుకూల ఫలితాలుంటాయి. కార్యాలయంలో పనిభారం పెరుగుతుంది. వ్యాపారస్తులు మెలకువగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఇతరుల నుండి ఎక్కువగా సలహాలు తీసుకుంటారు. పనులలో ఆటంకాలు ఎదురవుతాయి. గణపతిని అర్చించడం వల్ల ఆటంకాలను అధికమించగలుగుతారు. జీవన శైలిలో స్వల్ప మార్పులు చోటు చేసుకుంటాయి.

## తుల



అనుకూలంగా ఉంటుంది. ప్రత్యర్థులను ఎదిరించి నిలువగలుగుతారు. దీక్షా కార్యక్రమాలను పూర్తి చేస్తారు. వ్యాపారులకు శ్రమ అధికం. ఆర్థికంగా బాగుంటుంది. మీ సూచనలను ఉన్నత స్థాయి వర్గంవారు కూడా పాటించడం సంతోషం కలిగిస్తుంది. ఆరోగ్య పరమైన సమస్యలు ఎదుర్కొంటారు. శుభ కార్యాలకు ఆహ్వానాలు అందుకుంటారు. క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇచ్చి లాభపడతారు. అనవసరమైన విషయాలు పట్టించుకోరు.

## వృశ్చికం



ధైర్యంతో నిర్ణయాలు తీసుకుని వాటిని అమలు చేస్తారు. శుభకార్యాలకు ఆహ్వానాలు అందుకుంటారు. వాహనం కొనుగోలును తాత్కాలికంగా వాయిదా వేయడం మంచిది. ప్రచారంలో వున్న నిందారోపణలను రూపు మాపుకోవడానికి శ్రీకారం చుడతారు. నిష్కారణమైన తగాదాలు, వేధింపుల నుండి విముక్తి పొందడానికి సరికొత్త వ్యూహాలను అమలు పరుస్తారు. ఆరోగ్య నియమాలు పాటించడం మంచిది.

## ధనుస్సు



అనుకూలంగా ఉంటుంది. ఆవేశాన్ని కలిగి వుంటారు. ఆర్థిక పరమైన వత్తిళ్లను తట్టుకోగలుగు తారు. పొదుపు మాత్రం పాటించలేరు. సాంప్రదాయ కార్యక్రమాలను శ్రద్ధగా నిర్వహిస్తారు. వృత్తి, ఉద్యోగ, కుటుంబ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. సోదర వర్గం సహాయ సహకారాలు లభిస్తాయి. దీర్ఘకాలిక సమస్యలకు కొన్ని పరిష్కార మార్గాలు అందుకుంటారు. ప్రయాణాలు సానుకూలం.

## మకరం



శుభా శుభ మిశ్రమంగా ఉంటుంది. ఆరంభ శూరత్వంతో కొన్ని కార్యక్రమాలు ప్రారంభిస్తారు. ఉద్యోగస్తులకు ఊరట కలిగించే పరిణామాలు చోటు చేసుకుం టాయి. వ్యాపారస్తులకు మధ్యస్థంగా ఉంటుంది. సంతానం విద్యా రంగంలో పురోభివృద్ధి సాధిస్తారు. ఒక సమస్య తీరితే మరో సమస్యను పరిష్కరించుకోవాల్సి వస్తుంది. సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. కలిగినదానితో సంతృప్తి పడతారు.

## కుంభం



అనుకూలంగా ఉంటుంది. దీర్ఘకాలిక వేధింపుల నుండి విముక్తి పొందుతారు. దానధర్మాలు చేస్తారు. చట్టపరమైన చిక్కులను అధిగమించడానికి న్యాయ నిపుణులతో చర్చలు జరిపి సరికొత్త నిర్ణయాలు తీసుకుంటారు. స్నేహాలను మరింత విస్తృతపరుస్తారు. వినోద కార్యక్రమాల పట్ల అమితమైన ఆసక్తి కనబరుస్తారు. పరువు-ప్రతిష్టలకు ప్రాధాన్యతనిస్తారు.

## మీనం



స్వతంత్రించి నిర్ణయాలు తీసుకోరు. పది మంది దేనికి ఓటు వేస్తే ఆ నిర్ణయాలనే అమలు పరుస్తారు. ఆధ్యాత్మిక రంగంలో పురోభివృద్ధి సాధిస్తారు. అనారోగ్య సమస్యలు స్వల్పంగా ఇబ్బంది కలిగిస్తాయి. తక్కువ పెట్టుబడితో సాగించే వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. మీ వ్యవహార శైలికి భిన్నంగా వ్యవహరిస్తారు. ఒక మంచి పనికోసం విరాళాలు సేకరిస్తారు. కలుపుగోలుతనంతో విజయాలు సాధిస్తారు.

**వాస్తువార్త**
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్: 9885446501/9885449458

# ఎటు వైపు తల పెట్టి నిద్రిస్తే మంచిది?

**ఎస్.అన్విత – కాకినాడ**

ప్రశ్న: పడక గదిలో ఎటువైపు తల పెట్టి నిద్రించాలి? పశ్చిమ నైరుతిలో దేవుని పటం పెట్టి రోజూ దీపారాధన చేస్తున్నాం. అలా చేయవచ్చా?

జవాబు: దక్షిణ తలాపి పెట్టి నైరుతి గదిలో నైరుతి మూల మంచం మీద పడుకోవాలి. కింద పడుకోవద్దు. పటం పెట్టి పూజించినట్లయితే నైరుతి మూలకంటే తూర్పు ఈశాన్యాల గూడులో పటం పెట్టి పూజించడం వలన మంచి ఫలితాలు కనిపిస్తాయి. నైరుతి (దక్షిణ లేక పశ్చిమ) దిశలో పూజలు చేయటం వలన వివిధ రకాలుగా పనులు సానుకూలం కావు. విగ్రహాలున్నప్పుడు పశ్చిమ వాయవ్యంలో తూర్పుకు అభిముఖంగా పెట్టి పూజలు చేసుకోవడం మంచిది. కానీ నైరుతి ఏ విధంగానూ పూజకు సరైన స్థలం కాదు.



## అసంపూర్తిగా ఉన్న గదిని....?

**అఖిల్ – వికారాబాద్**

ప్రశ్న: ఇటీవలే నైరుతి దిశలో గది నిర్మాణానికి పూనుకున్నాం. అధిక వ్యయమైందిగానీ ఆ నిర్మాణం ఇంకా పూర్తవలేదు. ఆ గదిని నేను దేనికి వాడుకోవచ్చు. ఇల్లు నా భార్య పేరిట వుంది. మా ఇద్దరిలో ఆ గది ఎవరికి పనికి వస్తుంది?

జవాబు: నైరుతిలో గది కట్టేటప్పుడు సాధారణంగా నైరుతి మూల నుండి పునాది తవ్వటం ప్రారంభిస్తారు. అలా ప్రారంభించినప్పుడు ఆ గది నిర్మాణం మధ్యలో ఆగిపోవడం జరుగుతూ ఉంటుంది. నైరుతి మూల అప్పటికే కాంపౌండ్ గోడలు వుంటే ఆ గోడల దగ్గర నుండి తూర్పు, ఉత్తరాల వైపుకు పునాది తవ్వటం వల్ల కూడా గది నిర్మాణానికి ఆటంకాలు ఏర్పడే అవకాశాలున్నాయి. గది ఎంతమేరకు కట్టుకోవాలో ముందు నిర్ణయించుకొని ముగ్గు పోసి, ఆ ముగ్గు ఈశాన్యం నుండి పశ్చిమ, దక్షిణాలుగా ముందు పునాది తవ్వాలి. ఆ తర్వాత (కాంపౌండ్ గోడలు కట్టి లేకపోతే) నైరుతి మూల వైపుకు తవ్వి, నైరుతి మూల నుండి పునాదిరాళ్లు వేస్తూ చివరికి ఈశాన్య మూలకు పునాదిరాళ్లు వేయాలి. గోడ కట్టడం కూడా నైరుతి నుండి మొదలుపెట్టి ఈశాన్యం వరకు లేపాలి.

ఆ గదిని మీరు బెడ్ రూమ్‌గా ఉపయోగిస్తే మంచిది. ఆ గదిలో నైరుతిమూల బీరువా పెట్టి దానికి దగ్గరలో మంచాలను దక్షిణ తలాపి వచ్చేలా అమర్చుకుంటే మంచి ఫలితాలు కలుగుతాయి.

## మెట్లు ఆగ్నేయం వైపు ఉండవచ్చా?

**వాసుదేవరావు – కొడంగల్**

ప్రశ్న: తూర్పు, దక్షిణ ప్రహరీ గోడల మీద నుండి మెట్లు ఆగ్నేయం వైపు మళ్లాయి. అలా వుండవచ్చా?

జవాబు: తూర్పు, దక్షిణ ప్రహరీ గోడల మీద నుండి వెళ్లే మెట్లు ఆగ్నేయం వైపు వెళ్లవు. ఆగ్నేయ భాగంలో మెట్ల నిర్మాణం అవుతుంది. తూర్పు ప్రహరీ గోడను తాకకుండా, దక్షిణ ప్రహరీ గోడను తాకుతూగానీ, తాకకుండాగానీ ఆగ్నేయంలో మెట్ల నిర్మాణం జరుపుకోవచ్చు.

# దిక్కులు-హద్దులు

ఒక ఇంటి స్థలానికి సాధారణంగా నాలుగు భుజాలుంటాయి. అంటే ఇంటికి స్వరూపం చతురస్రాకారంగా గానీ, దీర్ఘ చతురస్రాకారంగా గానీ సాధారణంగా వుంటుంది. ఆ నాలుగు భుజాలు తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ భుజాలు.

తూర్పు దిక్కుగా వున్న భుజంలో వున్న భాగమంతా తూర్పు దిక్కు అవదు. తూర్పు, ఉత్తర భుజాలు కలియటం వల్ల ఏర్పడిన మూల ఈశాన్యం అవుతుంది. కానీ ఆ ఈశాన్యం ఎంతవరకు విస్తరించి వుంటుంది అన్నది కూడా ముఖ్యమైన విషయం. మిగతా మూడు భుజాలకు, మూడు మూలలకు కూడా ఇదే పద్ధతిలో వాటి వాటి విస్తీర్ణతను లెక్కగట్టవచ్చు.

తూర్పు దిక్కు భుజాన్ని కొలిచి, దాన్ని తొమ్మిది సమాన భాగాలుగా విడగొడుతూ మార్క్ చేసుకోవాలి. ఆ తొమ్మిది భాగాలలో ఉత్తరం వైపు వచ్చిన రెండు భాగాలు 'తూర్పు ఈశాన్యంగానూ, దక్షిణం వైపు వచ్చిన రెండు భాగాలను తూర్పు ఆగ్నేయంగానూ గుర్తించాలి'. మధ్యలో మిగిలిన ఐదు భాగాలు తూర్పు దిక్కు అవుతుంది.

అలాగే పడమర భుజాన్ని తొమ్మిది సమ భాగాలు చేస్తే దక్షిణం వైపున రెండు భాగాలు 'పడమర నైరుతి' మధ్యలో వున్న ఐదు భాగాలు 'పడమర' అవుతాయి. ఉత్తరం వైపున రెండు భాగాలు పడమర వాయవ్యం అవుతుంది.

ఉత్తర భుజాన్ని తొమ్మిది భాగాలుగా చేస్తే పడమర వైపు వచ్చే రెండు భాగాలు ఉత్తర వాయవ్యం, తూర్పు వైపున వచ్చే రెండు భాగాలు ఉత్తర ఈశాన్యం కాగా మధ్యలో మిగిలిన ఐదు భాగాలలో ఉత్తరం అవుతుంది.

దక్షిణ భుజాన్ని తొమ్మిది సమాన భాగాలుగా చేస్తే పడమర వైపున వచ్చే రెండు భాగాలు దక్షిణ నైరుతి, తూర్పున వచ్చే రెండు భాగాలు దక్షిణ ఆగ్నేయం కాగా మధ్యలో మిగిలిన ఐదు భాగాలు దక్షిణం అవుతుంది.

ఉత్తర ఈశాన్యం, తూర్పు ఈశాన్యం కలిసి పూర్తి ఈశాన్యం అవుతుంది.


తూర్పు ఆగ్నేయం, దక్షిణ ఆగ్నేయం కలిసి పూర్తి ఆగ్నేయం అవుతుంది.

దక్షిణ నైరుతి, పడమర నైరుతి కలిసి పూర్తి నైరుతి అవుతుంది.

పడమర వాయవ్యం, ఉత్తర వాయవ్యం కలిసి పూర్తి వాయవ్యం అవుతుంది.

# పదరంగం-23

**కూర్పు: పోపూరి విశ్వనాథ్**



## ఆధారాలు

### అడ్డం

1. చేసామంటే చేసామనేదానికి ఇలా అనడం రివాజు (4)
3. ప్రేమ, ఆదరం (4)
5. 3 నిలువు విపరీతమైతే (3)
6. పుర్రెలు ధరించే తాంత్రిక మతస్థుడు (5)
7. సంపాదన (3)
9. దట్టం, పొద (3)
12. ఏమీ తెలియనివాడు, ఏ తప్పూ చేయనివాడు (5)
13. అతిచిన్న శిశువు (4)
16. బోలు, ఖాళీ (2)
18. దినికంటే వడ్డీ తీపియని సామెత (3)
20. గొడవ తిరగబడింది (3)
13. రక్షకుడు (3)
24. కోపం (3)
25. గౌరవం, ప్రతిష్ఠ (3)

### నిలువు

1. తల మీద వేళ్లతో వేసే దెబ్బ (4)
2. అలుపు (4)
3. కోరిక, ఆకాంక్ష (2)
4. మైమరుపు (3)
5. అందరూ తీసుకోగా చివరికి మిగిలినవి (6)
8. దాచుట, మరుగుపుచ్చుట (4)
10. తలకిందులైన ఆకురసం (3)
11. పైకొచ్చిన సందేహం (4)
14. సైనికుడు (3)
15. కౌరవుల అనుంగుసోదరి (3)
17. పైకొచ్చిన దినితో పళ్లు తోముకుంటే మంచిది (4)
19. (అమ్మదగిన) వస్తువు (3)
21. అమెరికా కరెన్సీ (3)
22. కథలు ఇక్కడికి చేరతాయా (2)

## పదరంగం-21 జవాబులు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| అ1 | మ | లు2 | | వి3 | | ప్ర4 | చ | ర5 | ణ |
| గ | | వా6 | గు | డు | కా | య | | క్తి | |
| చా | | స | | ద | | త్నం | | | వీ7 |
| ట్లు8 | తి9 | | మొ10 | ల | క11 | | న12 | క13 | లు |
| | ఖ్యా | | | | ల | | | ను | |
| వి14 | ప్ర | ల15 | బ్ధ | | ప16 | రీ17 | ధా | వి | |
| | | కు | | ప18 | | ము | | పు19 | అ20 |
| చె21 | కు | ము | కి | రా | యి | | ది22 | | రి |
| లి | | కి | | భ | | | గు23 | డి | సె |
| మి24 | త్తి | | ది25 | వం | గ | తు | లు | | లు |

**పదరంగం-21కి జవాబులు పంపించినవారు**

1. సి.జి.శంకరరావు-హైదరాబాద్; 2. వి.వివేకానంద-సికిందరాబాద్; 3. ఎం.విష్ణువర్ధన్ రెడ్డి-మ్యాడంపల్లి; 4. జి.సుబ్రహ్మణ్యం గౌడ్-రాజంపేట; 5. యం.వి.రమణకుమారి-హైదరాబాద్.

జవాబులు పంపించాల్సిన చిరునామా:


**పదరంగం** ఆదివారం వార్త, నం.396,

లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.


పేరు : ............................................

............................................


ఊరు : ............................................



కొంచెం ఆర్టిఫిషియల్
ఇంటెలిజెన్స్ ఎక్కించండి డాక్టర్!!





జీవితాన్నే మార్చే ఐడియా!
తోయ్యాలా? లాగాలా?!

నిర్భయంగా
ఫిర్యాదు చెయ్యండి..
మీ వివరాలు
రహస్యంగా ఉంటాయి..
ఫిర్యాదుల పెట్టె
*** శాఖ


ఈ వారం కా'ర్టూన్స్'







భౌగోళిక

వింతగా చెప్పుకునే ఈ గోడ ఆస్ట్రేలియాలోని పెర్త్ నగరం సమీపంలోని వీట్‌బెల్ట్ ప్రాంతంలో ఉంది. స్థానికులు దీనిని కేటర్ కిచ్ అని పిలుస్తారట. భూగర్భంలో జరిగిన చర్యల వల్ల ఏర్పడిన ఈ కొండ అలల ఆకారంలో ఏర్పడింది. అందువల్ల దీనిని వేవ్ రాక్ అంటారు. ఇక చెప్పేదేముంది.. అక్కడి పర్యాటక ప్రాంతాల్లో ఇదీ చేరిపోయింది.



